J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 52 30.05.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




## సంక్షేమం, అభివృద్ధి 50-50

### › నత్త నడక నడుస్తున్న హామీలు › సంతృప్తిగా లేని సంక్షేమం

కూటమి ప్రభుత్వ పాలనకి మరో పది రోజులలో ఏడాది పూర్తి కావస్తోంది. ఈ ఏడాది కాలంలో తాము చేసిందేమిటి..? భవిష్యత్తులో చేయాల్సిందేమిటి..? అని కూటమి నేతలు ప్రశ్నించుకోవలసిన సమయం ఆసన్నమయింది. జరుగుతున్న పరిణామాలని పరిశీలిస్తే ఓ వైపు రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిపై దృష్టి సారిస్తూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను గట్టెక్కించాలని చంద్రబాబు వడివడిగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. అయితే, గత ప్రభుత్వంలో అతి సంక్షేమానికి అలవాటు పడిన జనం మాత్రం మాకేంటి..? అంటూ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే పరిస్థితి క్షేత్రస్థాయిలో కనిపిస్తోంది. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాల అమలుపై ప్రజలు బోలెడు ఆశలు పెట్టుకున్నారు. ఎప్పుడెప్పుడు తమ ఖాతాల్లోకి నగదు వచ్చిపడుతుందా..? అని ఎదురుచూసే వారికి కొదవేలేదు. అయితే, కూటమి ప్రభుత్వం మాత్రం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందని, వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని పదే పదే ఆరోపిస్తూనే వుంది. వాటిని చక్కదిద్ది రాష్ట్ర ప్రగతికి బాటలు వేసే క్రమంలో ఏడాది పాలనలో ఘనంగా ముందడుగు వేశామని కూటమి ప్రభుత్వ పెద్దలు స్పష్టం చేస్తున్నారు. వృద్ధాప్య పింఛన్ పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలను ఇప్పటికే అమలు చేస్తున్నామని, త్వరలోనే తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను పట్టాలెక్కిస్తామని హామీ ఇస్తున్నారు. ఏదేమైనా... బాబు ప్రభుత్వ ఏడాది పాలన మాత్రం ఆశనిరాశల సంగమం అని, సుఖ దుఃఖాల సమ్మేళనం అని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

### లక్ష్యాల సాధనలో ముమ్మందుకు..

నిజానికి కూటమి ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టి ఈనెల 12తో ఏడాదికాలం పూర్తవుతుంది. అయితే 2024 ఎన్నికల ఫలితాలు అదే ఏడాది జూన్ 4న వెల్లడయ్యాయి. దీంతో ఆరోజు నుంచే రాష్ట్ర అభివృద్ధి బాధ్యత చంద్రబాబు ప్రభుత్వానిదే అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ దృష్టితోనే ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన చంద్రబాబు ఏడాది పాలనకు గుర్తుగా ఈ ఏడాది జూన్ 4వ తేదీన 'వెన్నుపోటు దినం'గా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు జగన్ పిలుపునిచ్చారు. ఆరోజు అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలపడమే కాకుండా మేనిఫెస్టోలో పేర్కొన్న 143 హామీల అమలు, సూపర్ సిక్స్ సంగతేంటనే విషయంపై కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేయాలని సూచించారు. తద్వారా కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల కళ్లకుకట్టేలా తెలియజేయాలని నిర్ణయించారు.

### చంద్రబాబు ఆచితూచి..

ఓ వైపు అమరావతి, మరోవైపు పోలవరం, మధ్యలో సూపర్ సిక్స్ ఇవీ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన ప్రధాన హామీలు. వీటి అమలు కోసం ఓ వైపు వీలైనంతగా కేంద్రప్రభుత్వ సాయం పొందుతూనే మరో వైపు స్వశక్తితో గట్టెక్కాలని ఆయన చేయని ప్రయత్నం లేదు, వేయని ఎత్తులు లేవు. ఇలాంటి సమయంలో అప్పుల కుప్పగా మారిన రాష్ట్రానికి 2025-26 వార్షిక బడ్జెట్ ద్వారా ఆయన రాష్ట్ర ప్రగతి ప్రణాళికపై కొంత స్పష్టత ఇచ్చారు. దాదాపు 3లక్షల కోట్ల బడ్జెట్‌లో సూపర్ సిక్స్‌కు తొలి ప్రాధాన్యం ఇస్తామంటూనే, కొన్నింటినే పట్టాలెక్కిస్తామని నిధుల కేటాయింపు ద్వారా ప్రజలకు ఆయన ఓ సంకేతం ఇచ్చారు. నిజానికి రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు అన్నది దశాబ్దాలుగా ఉన్న వ్యవహారమే అయినా, వైఎస్.జగన్ దీనికి సరికొత్త అర్థాన్ని చెప్తూ అతి సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చి అభివృద్ధిని అటకెక్కించారనే వాదనలున్నాయి. సరిగ్గా ఇలాంటి సమయంలోనే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, భారతీయ జనతా పార్టీతో

10లో

## తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలని రక్తి కట్టిస్తున్న





# ఇంటి పోరు

### ఆంధ్రలో జగన్‌కి, తెలంగాణలో కేటీఆర్‌కి తలనొప్పి తెస్తున్న తోబుట్టువుల తగువు





పాత కాలంలో రాజ్యాధికారం కోసం అన్నదమ్ములు, అక్కా చెల్లెళ్ళ మధ్య వారసత్వ పోరు చోటు చేసుకునేది. ఈ క్రమంలో వారు యుద్ధాలకి, అనేక కుయుక్తులకి పాల్పడేవారు. ఆధునిక కాలంలో రాజ్యాలు, రాజులు లేరు కానీ, ఆ ఆనవాయితీని కొనసాగిస్తూ వారి స్థానంలో పార్టీలు, వాటి అధినేతలు వచ్చారు.

ప్రజాస్వామ్య యుగంలో వారసత్వాలకి తావు లేకున్నా కొన్నిసార్లు పార్టీలపై ఆధిపత్య కోసం అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మధ్య సంఘర్షణలు తప్పడం లేదు. తాజాగా తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన రాజకీయ కుటుంబాలుగా గుర్తింపు పొందిన వైఎస్సార్, కేసీఆర్ కుటుంబాల్లో చెల్లెళ్ళు అన్నలకి పంటికింద రాయిలా, కంటిలో నలుసులా తయారై వారి రాజకీయ ప్రస్థానానికి సవాళ్లు విసురుతున్నారు. ఇటీవల తెలంగాణలోని బీఆర్ఎస్ పార్టీలో కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయంటూ స్వయంగా కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత లేఖరాయడం సంచలనం రేపింది. ఇది తండ్రి కేసీఆర్‌పై యుద్ధమా? లేక అన్న కేటీఆర్‌పై తిరుగుబాటా అన్నది చర్చనీయాంశంగా మారింది.

### ఆంధ్రా ఫైర్‌బ్రాండ్ షర్మిల!

ఆంధ్రప్రదేశ్‌లో మొన్నటి వరకు రాజ్యాధికారం చెలాయించిన జగన్‌కి చెల్లెలు షర్మిల ఇప్పుడు ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా మారారు. 2024 ఎన్నికల వరకు అంతర్గతంగా ఉన్న విభేదాలు తర్వాత బహిర్గతమయ్యాయి. తనను రాజకీయంగా ఎదగకుండా జగన్ కుతంత్రాలు పన్నుతున్నారని, వైఎస్సార్ కాంగ్రెస్ అభివృద్ధి కోసం ఎంతో శ్రమించిన తనకు అన్న చేసే న్యాయం ఇదేనా అంటూ ఆమె తీవ్ర ఆవేదనకు గురయ్యారు. దీనికితోడు ఆస్తి పంపకాల్లో తేడాలు, భార్య మాట విని చెల్లిని, తల్లిని జగన్ దూరం పెడుతున్నారనే ఆరోపణలు వెరసి షర్మిల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారు. తర్వాత, తండ్రి ప్రాణంగా భావించే కాంగ్రెస్

2లో

## కలుగులో నుండి వెలుగులోకి..



# కటకటాల్లో కాకాణి

సుమారు గత రెండు నెలలుగా పోలీసులకి దొరకకుండా తప్పించుకు తిరుగుతున్న మాజీ మంత్రి, సర్వేపల్లి మాజీ శాసనసభ్యుడు, వైసీపీ నాయకుడు కాకాణి గోవర్ధనరెడ్డిని ఎట్టకేలకి పోలీసులు పట్టుకున్నారు. "నేను హైదరాబాదులో నా ఇంట్లోనే వున్నా, చేతనైతే ఎప్పుడైనా నన్ను అరెస్టు చేసుకోండి" అని పోలీసులకి సవాల్ విసిరిన కాకాణి, అదేరోజు సాయంత్రం నుండి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఎక్కడెక్కడో దాంకొని తిరుగుతూ చివరికి పోలీసులకి చిక్కారు. అక్రమ మైనింగ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, నిబంధనలకు వ్యతిరేకంగా పేలుడు పదార్థాల వినియోగం వంటి పలు కేసులలో కాకాణి ఏ4గా ఉన్నారు. మే 25వ తేదీ ఆదివారం నాడు కర్ణాటక రాష్ట్రం బెంగళూరు సమీపంలోని చింతామణి ప్రాంతంలోని ఒక ప్రైవేట్ వ్యవసాయ క్షేత్రం(ఫామ్ హౌస్)లో పోలీసులు గోవర్ధనరెడ్డిని అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుండి జిల్లాకి తరలించి,

2లో

# కటకటాల్లో కాకాణి

(మొదటిపేజీ తరువాయి)

మరుసటి రోజు సోమవారం నాడు ఆయనని వెంకటగిరి కోర్టులో ప్రవేశపెట్టారు. గోవర్ధన్‌రెడ్డికి న్యాయమూర్తి 14రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

## సోమిరెడ్డే లక్ష్యంగా...

కాకాణి గోవర్ధన్‌రెడ్డి రాజకీయంగా తాను సర్వేపల్లి నియోజకవర్గంలో అడుగు పెట్టినప్పటి నుండి అంటే.. 2014ఎన్నికల నాటి నుండి మాజీ మంత్రి, ప్రస్తుత సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకున్నారు. సోమిరెడ్డికి విదేశాల్లో కోట్ల రూపాయల అక్రమ ఆస్తులు ఉన్నాయన్న తప్పుడు ఆరోపణల అస్త్రాన్ని మొదటగా సోమిరెడ్డిపై ప్రయోగించాడు. అది వికటించడంతో భంగపడ్డాడు. తిరిగి సోమిరెడ్డే ఆయనపై కేసు పెట్టడంతో ఇరుకునపడ్డాడు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నెల్లూరు కోర్టులో దొంగలు పడి కేవలం కాకాణిపై సోమిరెడ్డిపెట్టిన కేసుకు సంబంధించిన దస్త్రాలు మాత్రమే దొంగిలించుకుపోవడం ఇప్పటికీ అంతుచిక్కని మిస్టరీగానే మిగిలిపోయింది. ఆ తరువాత సోమిరెడ్డిపై నీచాతి నీచమైన వ్యక్తిగత ఆరోపణలకి దిగాడు. కొన్ని సందర్భాలలో వాడు, వీడు అని కూడా సంబోధించాడు. శాసనసభ్యుడిగా ఆ తరువాత మంత్రిగా మితిమీరిన అహంకారాన్ని ప్రదర్శించాడు. తనకి ఎదురులేదన్నట్లుగా ప్రవర్తించాడు. తనపై వార్తలు రాసిన మీడియా సంస్థలు, వ్యక్తులపైన కూడా ధ్వజమెత్తాడు. కాకాణి అక్రమ మైనింగుని నేరుగా అడ్డుకోవడానికి ప్రయత్నించిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపైకి హిజ్రాలని ఉసికొల్పిన ఘనతని కూడా కాకాణి దక్కించుకున్నాడు.

# ఇంటి పోరు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీలో చేరి ఆంధ్రప్రదేశ్‌లో పీసీసీ పగ్గాలు చేపట్టారు. జగన్ వేసే ప్రతి అడుగుకీ అడ్డు తగులుతూ ప్రధాన రాజకీయ ప్రత్యర్థి అయిన చంద్రబాబు కంటే ఎక్కువగా తన అన్నని టార్గెట్ చేశారు. ముఖ్యంగా వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడు వైఎస్ అవినాష్‌రెడ్డిని జగన్ మోహన్‌రెడ్డే కాపాడుతున్నారని బహిరంగంగా విమర్శించారు. గొడ్డలి వేటుతో వివేకానందరెడ్డిని హతమార్చిన హంతకుల వెనుక ఉన్న ప్రధాన కుట్రదారు అవినాష్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి అని షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతేకాక నేరస్తులైన అవినాష్‌రెడ్డికే మళ్లీ జగన్ కడప ఎంపీ సీటును కేటాయించడంపై మండిపడ్డారు. తానే ప్రత్యర్థిగా అవినాష్‌రెడ్డిపై ధర్మపోరాటం చేస్తానని ప్రకటించి బరిలో దిగారు. ఎన్నికల్లో షర్మిల ఎంపీగా ఓడిపోయినా జగన్‌కి ఆయన పార్టీకి మాత్రం ఆమె కావాల్సినంత డ్యామేజ్ చేశారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రమంతా తిరుగుతూ జగన్ చెల్లెల్ని, తల్లిని మోసం చేశారని, చివరికి వైఎస్సార్ ఆశయాలకు కూడా తూట్లు పొడిచారని, రాజకీయ అవినీతికి పాల్పడ్డారని తీవ్ర విమర్శలు చేశారు. అవన్నీ కూడా ఓ విధంగా జగన్ ఓటమికి కారణంగా నిలిచాయన్నది రాజకీయ వర్గాల అభిప్రాయం. తర్వాత కూడా ఆస్తి పంపకాల్లో అన్యాయం చేశారని, భార్య భారతి మాటలు విని తల్లిని కూడా క్షోభకు గురిచేసి ఆమె ఆస్తులకు కూడా ఎసరుపట్టే దుస్సాహసానికి ఒడిగట్టారని విమర్శించారు. భవిష్యత్‌లో జగన్ చేసే ఏ చర్యకైనా ప్రతిచర్య గట్టిగానే ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో జగన్, షర్మిల శాశ్వత శత్రువులుగా మారేలా పరిస్థితులు ఏర్పడ్డాయి.

## తెలంగాణలో.. కేటీఆర్ వర్సెస్ కవిత!

ఇక టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందిన కేసీఆర్ పార్టీలోనూ లుకలుకలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. 2023 ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలవ్వడంతో కేసీఆర్ పూర్తిగా ఎర్రబల్లి ఫాంహౌస్‌కే పరిమితమైపోయారు. దీంతో కార్యనిర్వహణ అధ్యక్షుడు (వర్కింగ్ ప్రెసిడెంట్)గా ఉన్న కేటీఆర్ (కల్వకుంట్ల తారక రామారావు) పార్టీని అన్నీ తానై నడిపిస్తున్నారు. ఇదే సమయంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 16 ఎంపీ సీట్లకు గాను ఒక్క సీటును కూడా బీఆర్ఎస్ దక్కించుకోలేకపోయింది. దీంతో ఆ పార్టీ మనుగడపై నీలినీడలు కమ్ముకున్నాయి. పరిస్థితులు ఇలాగే ఉంటే పార్టీ పుట్టి మునగడం ఖాయమేననే ప్రచారం జోరందుకుంది. పార్టీకి ఎలాగైనా జవసత్వాలు నింపేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై బీఆర్ఎస్ ప్రత్యక్ష పోరుబాటకు సిద్ధమైంది. 30 పర్సెంట్ కమిషన్లు లేకుంటే ఎలాంటి పనులు జరగడం లేదని, మంత్రులందరూ రాజకీయ అవినీతికి పాల్పడుతున్నారని, రేవంత్‌రెడ్డికి పాలన చేతకావడం లేదంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇలాంటి ఆరోపణలతో ఆపార్టీ కొంతమేర పుంజుకున్నట్లు కనిపించింది. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భారీస్థాయిలో రజతోత్సవ సభ నిర్వహణకు సిద్ధమయ్యారు. మొదట ఈ సభకు కన్వీనర్‌గా హరీష్ రావును నియమించినట్లు ప్రకటించారు. సభను కూడా చేవెళ్ల నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని భావించారు. అయితే ఉన్నట్లుండి సభకు కన్వీనర్‌గా కేటీఆర్ ఉంటారని, సభను చేవెళ్లలో కాకుండా వరంగల్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ఉదంతంతో కేటీఆర్, హరీష్ రావుల మధ్య విభేధాలు బహిర్గతమయ్యాయి. ఇక రజతోత్సవసభలో ఎక్కడా హరీష్‌రావు, కవిత ఫొటోలు కనిపించకపోవడం కూడా చర్చనీయాంశమైంది. అలాగే, రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రసంగం కూడా బీఆర్ఎస్ శ్రేణులను పెద్దగా ఆకట్టుకోలేదనే చెప్పాలి. అయితే ఇన్నాళ్లు స్తబ్దుగా ఉన్న పార్టీ కార్యకర్తలకు మాత్రం ఈ సభ కొంత ఊపును తీసుకొచ్చిందనే చెప్పాలి. ఇదే ఊపుతో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాగైనా సత్తా చాటాలని బీఆర్ఎస్ అధిష్టానం నిర్ణయించింది. అయితే సరిగ్గా ఇదే తరుణంలో తండ్రి కేసీఆర్‌కు కూతురు కవిత లేఖ రాయడం, ఆ విషయం బయటకు పొక్కడం కేసీఆర్ కుటుంబంతో పాటు తెలంగాణ రాజకీయాలలో కూడా పెద్ద దుమారమే రేపింది.

## ఇంతకూ లేఖ సారాంశమేంటంటే!

తన తండ్రి కేసీఆర్‌కు కవిత ఘాటు వ్యాఖ్యలతోనే లేఖ రాశారు. పార్టీలో ఓ కోటరీ చేతిలో కేసీఆర్ బందీగా మారారంటూ ఆమె ధ్వజమెత్తారు. ఆ కోటరీ వల్లే తాను రాసిన లేఖ కూడా బయటకు వెల్లడైందని ఆరోపించారు. ఇక రజతోత్సవ సభలో కేసీఆర్ బీజేపీపై రెండు నిమిషాలే మాట్లాడడం కూడా బీజేపీకి, బీఆర్ఎస్‌కి ఉన్న లోపాయికారి ఒప్పందాన్ని తేటతెల్లం చేసిందని ఆమె నిందించారు. ఇక రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జిలుగా పాతవారినే కొనసాగించడం తగదని కొత్తవారికి అవకాశం ఇవ్వాలని ఆమె స్పష్టం చేశారు. అదే సమయంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, ఎమ్మెల్యేకి కూడా కేసీఆర్ అపాయింట్‌మెంట్ కోసం నెలల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అంత ఎదురు చూసినా అపాయింట్‌మెంట్ దక్కుతుందనే గ్యారంటీ లేకపోవడం పార్టీకి ఎంతమాత్రం మంచిది కాదని లేఖలో కవిత సూచించారు. దీంతో ఆ పార్టీలో పెద్ద దుమారమే రేగింది. ఇదే సమయంలో కవిత మీడియా ముందుకొచ్చి పార్టీలో కేసీఆర్ చుట్టూ దెయ్యాలతో నిండిన కోటరీ ఉందంటూ వ్యాఖ్యలు చేయడంతో బీఆర్ఎస్‌లో గందరగోళం నెలకొంది. ఇది తండ్రి, అన్నపై కవిత చేసిన తిరుగుబాటు అని బీజేపీ, కాంగ్రెస్ ధ్వజమెత్తాయి. త్వరలోనే కవిత కొత్త పార్టీ పెట్టి ఆంధ్రాలో షర్మిల తరహాలోనే తాను కూడా అన్న కేటీఆర్‌కి వ్యతిరేకంగా రాజకీయలు చేస్తారనే ప్రచారం జోరందుకుంది.

ఏదేమైనా 'అ ..ఆ' సినిమాలో చెప్పినట్లు "శత్రువులు ఎక్కడో ఉండరు.. చెల్లెళ్ళ రూపంలోనూ, కూతుళ్ళ రూపంలోను మన కొంపలోనే తిరుగుతుంటారు" అని రావు రమేష్ డైలాగ్ తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన పార్టీల్లో జరుగుతున్న పరిణామాలకు చక్కగా సరిపోతుందనే చర్చ ఇప్పుడు రాజకీయవర్గాలలో హాట్ టాపిక్. ఇటు ఆంధ్రాలోనూ, అటు తెలంగాణలోనూ నడుస్తున్న కుటుంబ కథా చిత్రాన్ని అందరూ ఆసక్తిగా గమనిస్తున్నారు..!

## కాలధర్మం

## పెనుబోలు రాజగోపాలరెడ్డి



కోరా విద్యాసంస్థల మాజీ డైరెక్టర్, 'కోరా' రాజగోపాలరెడ్డిగా సుప్రసిద్ధులైన పెనుబోలు రాజగోపాలరెడ్డి(83) మే28వతేదీ బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నారు. చిల్లకూరు మండలం వలిపేడు రాజగోపాలరెడ్డి స్వగ్రామం. ఆయన బాల్య విద్యాభ్యాసమంతా స్వగ్రామంలోను, కోట గ్రామంలోనూ గడిచింది. నెల్లూరు వీ.ఆర్.కళాశాలలో పి.యు.సి. అనంతరం బి.ఎస్.సి పూర్తిచేశారు. ఆ తరువాత ఉత్తరప్రదేశ్‌లోని 'అలీఘడ్' విశ్వవిద్యాలయం నుండి ఏం.ఎస్.సి బయోకెమిస్ట్రీలో యూనివర్సిటీలోనే ప్రథమశ్రేణిలో పట్టా పుచ్చుకుని, బంగారు పతకం కూడా అందుకున్నారు.

విద్యాభ్యాసం పూర్తయిన తరువాత హైదరాబాదులోని కెమినార్ డ్రగ్స్ సంస్థలో రీసెర్చ్ స్కాలర్‌గా 2 సంవత్సరాలు ఉద్యోగం చేశారు. రాజగోపాలరెడ్డిలోని ప్రతిభా నైపుణ్యాన్ని గుర్తించిన కెమినార్ సంస్థ పరిశోధనల కోసం ఆయనని అమెరికాకి పంపాలని నిర్ణయించింది. అయితే, జన్మభూమిపై వున్న మమకారంతో చివరి నిముషంలో అమెరికా ప్రయాణం మానుకున్నారు రాజగోపాలరెడ్డి. 1967లో ఇందిరమ్మని సహధర్మచారిణిగా చేసుకున్నారు. 1969లో వీ.ఆర్. కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా చేరారు. దాదాపు రెండు దశాబ్దాలపాటు ఉద్యోగం చేస్తూనే 1985 –1988 మధ్య కాలంలో ట్యూషన్లు చెప్పడం ప్రారంభించారు. ఆ తరువాత 1988లో తన సహచర లెక్చరర్‌లతో కలిసి నెల్లూరు నగరంలో 'కోరా' విద్యాసంస్థలని నెలకొల్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే నెం.1గా ఒక దశాబ్దకాలం పాటు కోరా విద్యాసంస్థలు దేదీప్యమానంగా ప్రకాశించాయి. అనివార్య కారణాలవల్ల 2000వ సంవత్సరంలో అవి మూతబడ్డాయి. ఆ తరువాత నుండి రాజగోపాలరెడ్డి పూర్తిగా విశ్రాంత జీవితాన్ని గడిపారు. రాష్ట్రంలోని అనేకమంది ప్రముఖులతో రాజగోపాలరెడ్డికి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండేవి. ముఖ్యంగా దివంగత ముఖ్యమంత్రులు నేదురుమల్లి జనార్ధనరెడ్డి, డాక్టర్. వై.ఎస్.రాజశేఖరరెడ్డిలకి రాజగోపాలరెడ్డి అత్యంత ఆప్తుడు. రాజయ్యా అని ఒకరు, రాజన్నా అని మరొకరు ఆయనని ఆప్యాయంగా పిలిచేవారు.

రాజగోపాలరెడ్డికి భార్య ఇందిరమ్మ, కుమారుడు మహేష్, కుమార్తె శిరీష ఉన్నారు. పెనుబోలు కుటుంబసభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

## ఆడిటర్ సుబ్బప్ప



ప్రముఖ ఆడిటర్ సీ.వీ.సుబ్రహ్మణ్యం మే27 మంగళవారం సాయంత్రం కన్నుమూశారు. ఆయన వయస్సు 70 సంవత్సరాలు. సుబ్బప్పగా ఆయన సమాజానికి సుపరిచితులు. సుబ్బప్పకి ఆధ్యాత్మిక తత్పరత ఎక్కువ. ముఖ్యంగా తిరుమల తిరుపతి దేవస్థానాలకి సంబంధించి ఎలాంటి కార్యక్రమం జరిగినా ఆ కార్యక్రమంలో ప్రధానపాత్ర సుబ్బప్పే తీసుకుంటారు. టీటీడీ అయ్యవార్లకి తమ స్వగృహంలో నియమ నిష్టలతో ఆహారం వండించి వడ్డించేవారు. ఆడిటర్‌గా కూడా సుబ్రహ్మణ్యం బాగా ప్రసిద్ధి. నాలుగున్నర దశాబ్దాలకిపైగా ఆయన నెల్లూరులో తన సేవలందిస్తున్నారు. వృత్తిపరంగా ఆడిటర్ అయినప్పటికీ మంచి పౌరసంబంధాలు ఆయన ప్రవృత్తి. అనేకమంది అధికార అనధికార ప్రముఖులతో, మిత్రులతో, తన శ్రేయోభిలాషులతో నిత్యం టచ్‌లో ఉండేవారు. సుబ్బప్పకి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అనుకోని ఆకస్మిక అనారోగ్యంతో ఆయన హఠాన్మరణం పొందారు. సుబ్బప్ప ఆత్మశాంతికై ప్రార్థిస్తూ, ఆయన కుటుంబసభ్యులకి ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# క్షయవ్యాధి నియంత్రణకు చర్యలు చేపట్టాలి



జిల్లాలో ముమ్మరంగా క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, క్షయ నిర్మూలనకు సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈనెల 28న నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షయవ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధిసోకిన వారిని గుర్తించి మెరుగైన చికిత్స అందించాలని చెప్పారు. క్షయ వ్యాధికి సంబంధించిన చికిత్సలను అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో, ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందిస్తున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి సుజాత, డిస్టిక్ లెప్రసీ ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎస్‌కె ఖాదర్‌వల్లి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ పాల్గొన్నారు.

## సోలార్ ప్యానల్స్‌తో.. బిల్లులు తగ్గించుకోవచ్చు

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ యోజన పథకం కింద సోలార్ ప్యానల్స్ ఏర్పాటుచేసుకున్న వారికి కరెంటు బిల్లులు బాగా తగ్గిపోతాయని విద్యుత్‌శాఖ ఎస్ఇ విజయన్, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ నందన్‌లు తెలిపారు. ఈనెల 28న నగర కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ, నగరపాలక సంస్థలోని సిబ్బంది సూర్యఘర్ పథకం ప్రయోజనాన్ని తెలుసుకుని, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 1కిలో వాట్ విద్యుత్ ఉత్పత్తి సోలార్ ప్యానల్ ఏర్పాటుకు లక్ష రూపాయలు ఖర్చవుతాయని, అందులో 30 శాతం సబ్సిడీ ఉంటుందని, మిగిలిన మొత్తంలో 80 శాతం బ్యాంకులు రుణం ఇస్తాయన్నారు.

# పాతికేళ్ళుగా ప్రజలకు 'కిమ్స్' ఆసుపత్రి సేవలు

## • సిల్వర్ జుబ్లీ వేడుకల్లో ప్రశంసించిన నాయకులు



నెల్లూరుజిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలందిస్తూ, ఇరవై అయిదేళ్ళుగా ప్రజల మన్ననలు అందుకుంటోంది నెల్లూరులోని కిమ్స్ వైద్యశాల. బొల్లినేని ఆసుపత్రిగా పేరొందిన ఈ వైద్యశాలలో జిల్లా ప్రజలకే కాక, చుట్టుపక్కల జిల్లాలోని ప్రజలకు కూడా 22 రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలందుతుండడం విశేషం. ఈ ఆసుపత్రిని దివంగత బొల్లినేని రమణయ్య తమ ధర్మపత్ని బొల్లినేని వెంకమ్మ స్మారకార్థం నెలకొల్పారు. బొల్లినేని సోదర త్రయంగా ఉన్న బొల్లినేని కృష్ణయ్య, బొల్లినేని శీనయ్య, ప్రముఖ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావుల అమోఘమైన కృషితో ఈ ఆసుపత్రిని భారీస్థాయిలో నిర్మించి, 2000వ సంవత్సరంలో ప్రారంభించారు. 250 పడకలతో, వందలాది మంది వైద్యసిబ్బందితో ఇప్పటిదాకా వేలాదిమంది రోగులకు వైద్యసేవలందించారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి నిర్మించి పాతిక సంవత్సరాలైన సందర్భంగా ఇటీవల నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో కిమ్స్ ఆసుపత్రి సిల్వర్ జుబ్లీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, డివి కృష్ణారెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, బల్లి కల్యాణచక్రవర్తి తదితరులంతా పాల్గొని పాతికేళ్ళుగా కిమ్స్ ఆసుపత్రి ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. బొల్లినేని యాజమాన్యం తరపున ఆసుపత్రి ఛైర్మెన్..మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య, కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్లు బొల్లినేని శీనయ్య, డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బొల్లినేని అభినయ్, డైరెక్టర్ బొల్లినేని అద్విక్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరినాయుడు, డాక్టర్ సతీష్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తమ ఆసుపత్రిలో గత పాతిక సంవత్సరాలుగా నిర్విరామంగా సేవలందిస్తున్న సిబ్బందికి డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలనిచ్చి, నగదు బహుమతులతో సన్మానించారు.







## ముఖ్యమంత్రిని సన్మానించిన వేమిరెడ్డి దంపతులు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులుగా ఎన్నికైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి..ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఘనంగా సన్మానించారు. కడపలో మహానాడు సభ వేదికపై రెండవ రోజున పార్టీ జాతీయ అధ్యక్షునిగా చంద్రబాబు ఎన్నికైన అనంతరం వేమిరెడ్డి దంపతులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నెల్లూరు నేతల ధారాళం

• మహానాడులో భూరి విరాళం

• 5 కోట్లు ఇచ్చిన వీపిఆర్ • కోటిన్నర ఇచ్చిన మాగుంట

• ఆనం రామనారాయణ, నారాయణ చెరో కోటి

మే 27 నుండి మూడు రోజులపాటు కడప గడపలో జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడులో నెల్లూరు నేతలు తమ ధారాళాన్ని ప్రదర్శించారు. మహానాడు నిర్వహణకి, పార్టీ కార్యకర్తల సంక్షేమానికి, పార్టీ సంరక్షణకి అవసరమైన నిధులు అందించడంలో మన నేతలు ముందువరసలో నిలిచారు. తొలిరోజు 27వ తేదీ జరిగిన కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు, చేతికి ఎముక లేని దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తనవంతుగా 5కోట్ల రూపాయల విరాళాన్ని ప్రకటించి చెక్కుని అందించారు. ఇదే క్రమంలో మన జిల్లాకి చెందిన మాగుంట శ్రీనివాసులరెడ్డి కోటీ యాభై లక్షలు ఇవ్వగా, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ చెరో కోటిరూపాయలని అందించారు. ఏపీ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి కూడా తనవంతుగా 10లక్షల చెక్కును అందచేశారు. 'మహానాడు'లో తొలిరోజు వచ్చిన విరాళాలలో ఎక్కువ మొత్తం నెల్లూరీయులదే కావడం గమనార్హం.

### కాకాణి ప్రమేయం లేకుండానే..

# అక్రమ మైనింగ్ జరిగిందా?..

**వైకాపా నాయకులకు సోమిరెడ్డి సూటిప్రశ్న**



**మాజీ మంత్రి కాకాణి అరెస్ట్ అక్రమమని కొందరు అంటున్నారని, ఆయనపై అక్రమ కేసు బనాయించారంటూ వైకాపా నేతలు తెగ బాధపడిపోతున్నారని, అయితే కాకాణి ప్రమేయం లేకుండానే అక్రమ మైనింగ్ జరిగిందా?.. అని సర్వేపల్లి ఎమ్మెల్యే సూటిగా ప్రశ్నించారు.**

ఇటీవల ఆయన పొదలకూరులో విలేకర్లతో మాట్లాడుతూ, కాకాణికి సంబంధం లేకుండా వరదాపురం రుస్తుం మైన్ నుంచి 60 వేల టన్నుల క్వార్ట్జ్ తరలిపోయిందా?.. అన్నారు. మొగళ్లూరు, దేగపూడిలో అక్రమ మైనింగ్, తోడేరులో డంపింగ్ గోవర్ధన్ రెడ్డికి తెలియకుండానే జరిగాయా అని ఆయన ప్రశ్నాస్త్రాలు సంధించారు. మంత్రిగా వ్యవహరించిన కాకాణి ప్రమేయం లేకుండా ఆయన సొంత మండలం పొదలకూరులో అక్రమ మైనింగ్, డంపింగ్ జరిగాయా?.. అన్నారు. వైకాపా హయాంలో కాకాణి అరాచకాలకు అంతే లేదని, టీడీపీ నాయకులు, కార్యకర్తలపై, అమాయకులపై తప్పుడు కేసులు పెట్టి జైల్లో వేయించాడని, జర్నలిస్టులను కూడా వదిలిపెట్టలేదని ఆయన గుర్తుచేశారు. ఆ రోజు జైళ్లలో మగ్గిపోయిన వారికి కుటుంబాలు లేవా.. భార్యాపిల్లలు లేరా అని ప్రశ్నించారు.

తనపై కూడా 18 అక్రమ కేసులు పెట్టించి వేధించాడని, ఆస్తులను ధ్వంసం చేయించాడని, కోడూరులో రొయ్యల గుంతలు ధ్వంసం చేయించి రూ.1.50 కోట్ల విలువైన రొయ్యలను సముద్రంలోకి వదిలిపెట్టించాడని తెలిపారు. కంటేపల్లిలో సెల్ ఫోన్ టవర్లు, చెముడుగుంటలో లారీ కాటా కూలగొట్టించాడని, నల్లబాళెంలో పైపులైన్లు ధ్వంసం చేయించి 15 ఎకరాల సంపంగి తోటల్ని బీడు పెట్టించాడని ఆయన వివరించారు. పొదలకూరులో దుకాణాల ముందు పట్టలు వేసుకున్నారని 16 మంది ఆర్య వైశ్యులను 14 రోజులు జైలులో పెట్టించాడన్నారు. తప్పుడు పనులు చేసి జైలుకు వెళ్ళిన కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై వైసీపీ నేతలు సానుభూతి చూపడం దురదృష్టకరమని ఆయన అన్నారు. ఎవరేం చేసినా, దేవాలయాల లాంటి న్యాయస్థానాలున్నాయని, ఎవరు తప్పు చేసినా శిక్షిస్తాయని అంటూ, అప్పుడు చేసిన పాపాల మూలంగానే కాకాణి ఇప్పుడు జైలుకెళ్ళాడని అన్నారు.

## నివాళి



జననం 01.02.1942

నిర్యాణం 28.05.2025

**పెనుబోలు రాజగోపాలరెడ్డి గారు**

మాజీ డైరెక్టర్, కోరా విద్యాసంస్థలు

అన్నా.. భౌతికంగా మీరు మా మధ్య లేకున్నా..
మా మనసుల్లో శాశ్వతంగా నిలిచే ఉంటారు.

అశ్రునయనాలతో..

నెల్లూరు.

లాయర్
మే 30, 2025

# పర్యావరణాన్ని కాటేస్తున్న.. 'ప్లాస్టిక్ కాలుష్యం'!

'చేసుకున్నవాళ్ళకి చేసుకున్నంత మహాదేవా' అన్నట్లు మనకు మనమే అనేక రకాల ప్రమాదాలను చేజేతులా తెచ్చుకుంటున్నాం. రానున్న విపత్తులను ముందుగానే హెచ్చరించినా పట్టించుకోకుండా ఆ జరిగేదేదో జరిగితే చూద్దాంలే అన్నట్లుగా నిర్లక్ష్యంగానే ఉంటున్నాం. పర్యవసానంగా ఇప్పుడు అనేక రకాల కల్తీలు, కాలుష్యాల తాలూకు కష్టాలను అనుభవిస్తున్నాం. అయినా, కాలుష్యాన్ని నివారించుకోవడానికి గానీ, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి గానీ ఆశించిన స్థాయిలో ఎక్కడా ప్రయత్నాలు జరగడం లేదు. ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచంలోని అన్ని దేశాలు ప్రజలకు పెనుముప్పుగా పరిణమిస్తున్న కాలుష్యాల పట్ల ఉదాసీనంగానే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో, ఎంతో ప్రమాదకరమైన 'ప్లాస్టిక్ కాలుష్యం' ఇప్పుడు ప్రపంచమంతా భయంకరంగా విస్తరిస్తోంది. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ పదార్థాలు, వాటికి సంబంధించిన వ్యర్థాలే ఎక్కడ చూసినా. నేలమీదనే కాదు, కాలువలు, చెరువులు, నదులు, చివరికి సముద్రాల్లో కూడా ఆ వ్యర్థాలే గుట్టలుగుట్టలుగా పేరుకుపోతున్నాయి. తినే ప్లేటు, తాగే గ్లాసు కూడా ప్లాస్టిక్‌వే. యూజ్ అండ్ త్రో అంటూ ఒక్కసారి అలా వాడి ఇలా విసిరి పారేసే ప్లాస్లిక్ వస్తువులు, ప్లాస్టిక్ కవర్లు కోటానుకోట్ల టన్నులుగా నేలమీద పేరుకుపోతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచమంతా ప్లాస్టిక్ భూతం విజృంభిస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలతో భూగోళం నిండిపోతోంది. ప్లాస్టిక్ కాలుష్యం ఎవరూ నియంత్రించలేనంత భారీస్థాయికి చేరిపోతోంది. ప్లాస్టిక్ అన్నది మానవాళి జీవితంలో ఒక భాగంగా మారిపోయి, అది లేకుండా మనం ఉండలేమనే స్థాయికి వచ్చేసింది. ఒక్క నేల మీదనే కాక, నదులు, కాలువలు, చెరువులు చివరికి సముద్రాలను కూడా ప్లాస్టిక్ వదిలిపెట్టడం లేదు. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాల గుట్టలే. ఏటా సుమారుగా 1.1కోట్ల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లోకి వచ్చి చేరుతున్నాయని, దీనివల్ల ఆ నీళ్ళు కూడా కలుషితమైపోయి అందులో ఉండే జీవరాశులకు ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. అయినా, ఏళ్ళ తరబడిగా అన్ని దేశాల్లో ప్లాస్టిక్ ఉత్పత్తి గణనీయంగా పెరిగిపోతూనే ఉంది. ఇటీవలి కాలంలో ఏటా సుమారు 50 కోట్ల టన్నులకు పైగానే ప్లాస్టిక్ ఉత్పత్తి అవుతోందని అంటున్నారు. దీంతో, ఇప్పటికే ఈ భూమ్మీద దాదాపు 6 వందల కోట్ల టన్నులకు పైగానే ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి ఉంటాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో అటు పర్యావరణానికి..తద్వారా మానవాళికి ఎంత కష్టం.. ఎంత నష్టం వాటిల్లనుందో ఎవరూ పట్టించుకోవడం లేదు. వాస్తవానికి ప్లాస్టిక్ ఉత్పత్తి, వినియోగాల వల్ల కలిగే అనర్థాలు అన్నిన్ని కావని, వీటి తయారీకి వాడే శిలాజ ఇంధనాలు, రసాయనాలు, శుద్ధి తదితర ప్రక్రియల వల్ల పెద్దఎత్తున కాలుష్యం ఏర్పడుతోందని, భూగర్భంలోంచి వెలికితీస్తున్న చమురు, సహజవాయువుల్లో 10 శాతం దాకా ప్లాస్టిక్ ఉత్పత్తికే సరిపోతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆ ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ చివరికి నదులు, సముద్రాల్లో కలవడం వల్ల జలవనరులు, దెబ్బతింటున్నాయని, వాటిలో ఉండే జీవజాతులకు, మత్స్యసంపదకు సైతం ఎంతో హాని కలుగుతోందని అంటున్నారు. ఇప్పటికే పరిశ్రమల ద్వారా వచ్చే కాలుష్యం, రకరకాల రసాయనాల విషవాయువులు గాలిలో కలుస్తుండడం వగైరాల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది. ఇవి చాలవన్నట్లు నిరంతరం ప్లాస్టిక్ వినియోగం అనంతంగా పెరిగిపోతోంది. రకరకాల కాలుష్యాలతో భూమండలమంతా కాలుష్య కాసారంగా మారిపోయింది. చివరికి..మనం తినే ఆహారంలోకి, తాగే నీటిలోకి, పీల్చే గాలిలోకి కూడా ఈ కాలుష్యం జొరబడి మన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. మొత్తంగా ఈ దుస్థితులన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకించి ఈ ఏడాది జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించాలంటూ' ఐక్యరాజ్య సమితి తన లక్ష్యాన్ని ప్రకటించింది. ఇకనైనా మానవాళి మేలుకోవాలని, ప్రపంచానికే ప్రమాదకరంగా తయారవుతున్న ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలని పిలుపునిచ్చింది. ప్లాస్టిక్‌ని తిరస్కరించడం, లేదా తగ్గించడంపై వెంటనే ప్రజలంతా దృష్టిపెట్టాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసేందుకు, సింగిల్‌యూజ్డ్ ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. అయినా..మనకు ఉండేది ఒకే ఒక్క భూమి..మనకు నీడనిస్తున్న భూమాతను కాలుష్య భూతం కాటేయకుండా కాపాడుకోవడం అందరి బాధ్యత!...

- (జూన్ 5, ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

# రాజోలు నుండి వింజమూరుకి డబల్ రోడ్డు వేయాలి!

ఆత్మకూరు ప్రాంతం నెల్లూరుపాళెం నుండి వింజమూరుకి వెళ్లే మార్గం తరచూ వందల వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటోంది. హైదరాబాదు, బెంగళూరు వంటి మహానగరాలకి అటు ఆత్మకూరు ఇటు వింజమూరు మీదుగా అనేక వాహనాలు రోజూ తిరుగుతూనే ఉంటాయి. నెల్లూరుపాళెం నుండి వింజమూరు వరకూ అత్యంత అధ్వాన్నంగా ఉన్న ఈ రోడ్డుకి ఇటీవల కొన్ని మరమ్మతులు చేసి మెరుగుపరచారు. అయితే, ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోకి వచ్చే రాజోలు గ్రామం వరకు మాత్రమే ఈ మార్గాన్ని డబుల్ రోడ్డుగా విస్తరించారు. అక్కడ నుండి వింజమూరు వరకూ సింగిల్ రోడ్డుగానే వదిలేశారు. ఈ భాగం ఉదయగిరి నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. రాజోలు–వింజమూరుల మధ్య అధికంగా అటవీశాఖ భూములు ఉన్నందువలన రోడ్డు విస్తరణకి ఆటంకం ఏర్పడుతోందని అధికారులు చెప్తున్నారు. ఉదయగిరి ఎం.ఎల్.ఏ కాకర్ల సురేష్ గారు ఈ విషయంపై దృష్టిపెట్టి సంబంధిత అధికారులతో చర్చించి మిగిలిన రహదారిని కూడా డబుల్ రోడ్డుగా విస్తరించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

ఎం. రామకృష్ణాచారి - వింజమూరు.

# ఆలయాల దగ్గర పోలీసు రక్షణ కల్పించాలి

నెల్లూరునగరంలో అనేక ఆలయాల వద్ద ఆయా రోజుల ప్రాముఖ్యతని బట్టి రద్దీ విపరీతంగా ఉంటోంది. ఉదాహరణకి మూలాపేట శివాలయం వద్ద సోమవారం, సంతపేట హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం, సాయిబాబా ఆలయాల వద్ద గురువారం, రాజరాజేశ్వరి, ఇరుకళల పరమేశ్వరి గుళ్ళ వద్ద శుక్రవారం, మాగుంట లే అవుట్ వెంకటేశ్వర ఆలయం వద్ద శనివారాలలో భక్తులు అధికసంఖ్యలో వస్తుంటారు. ఆయా ఆలయాల వద్ద కనీస బందోబస్తు కూడా లేకపోవడంతో భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ అవస్థలతో పాటు, మహిళలకి అవసరమైన కనీస రక్షణ కూడా కరువవుతోంది. జిల్లా ఎస్.పీ. గారు సమస్యని పరిశీలించి ఆలయాల వద్ద తగిన రక్షణ కల్పించవలసినదిగా కోరుతున్నాను.

పి. రమణికుమారి - రిటైర్డ్ టీచర్, ఫత్తేఖాన్‌పేట.

# కాకాణి ఉద్యమ నాయకుడా?

అక్రమ మైనింగ్ కేసులో కాకాణి గోవర్ధనరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత రెండునెలలుగా దాక్కొని తిరుగుతున్న ఆయనని కనిపెట్టి లోపల పెట్టారు. దీనిపై జిల్లా వైసీపీ నేతలు స్పందించిన తీరు జుగుప్స కలిగిస్తోంది. కాకాణిని అదుపులోకి తీసుకున్నారన్న వార్త బయటకి రాగానే అనిల్‌యాదవ్ నాయకత్వంలో అందరూ కలవడం, అరెస్టు అక్రమమని ఖండించడం హాస్యాస్పదంగా వుంది. అంతే కాకుండా పక్కరోజు వెంకటగిరి కోర్టువద్దకి వెళ్ళి పోలీసు నిబంధనలని కూడా ఉల్లంఘించి వందలమందితో బలప్రదర్శన చేయడం అతిగా కనిపించింది. కాకాణి ఉద్యమ నాయకుడు కాదు. ఆయన ప్రజాసమస్యలపై పోరాడి అరెస్టు కాలేదు. వందల కోట్ల దోపిడీ వ్యవహారంలో పోలీసులు ఆయనని అరెస్టుచేసి జైలుకి పంపారు. దీనికి ఇంత రాద్ధాంతం చేయడం వైసీపీ నేతల నైజానికి అద్దం పడుతుందనడంలో సందేహం లేదు.

కే. వీ. కుమార్ - బాలాజీనగర్, నెల్లూరు.

## సత్యపీఠం

నిజాలే మాట్లాడుకుందాం! 92

# ఆదరణ కోల్పోతున్న.. 'ఆయుర్వేదం'..!

ప్రకృతి వనరులకు, దివ్యమైన ఔషధాలకు కొదవే లేని మన దేశంలో, ఏ చిన్న అనారోగ్యం వచ్చినా భయపడిపోయే దుస్థితి ఏర్పడింది. 'అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని' అన్నట్లుగా మన వద్ద అన్ని వనరులూ ఉన్నా, సద్వినియోగం చేసుకోలేని దౌర్భాగ్యం దాపురించింది. సంపాదనే తమ విధిగా, కోట్ల రూపాయల ఆర్జనే పరమావధిగా ఆధునికత పేరుతో అనేక రకాల వైద్యాలు, ఔషధాలు ఇప్పుడు రాజ్యమేలుతున్నాయి. కానీ, పూర్వకాలంలో అలా కాదు. ఆయుర్వేద వైద్యమే ప్రజలకు శ్రీరామరక్షగా ఉండేది. మొండి, జగమొండి రోగాలను సైతం ఇట్టే నయంచేసే ఆయుర్వేద వైద్యులు ఉండేవాళ్ళు. నాడి పట్టుకుని శరీరంలో ఏ జబ్బు ఏ స్థాయిలో ఉందో ఇట్టే కనిపెట్టగలిగే మేధావులు, మహానుభావులు రోగానికి తగ్గ వైద్యమందించేవారు. చిటికెలో వ్యాధి తగ్గించేవారు.

డబ్బుల కోసం ఆరాటపడకుండా ప్రజల ఆరోగ్యం బాగుండాలని తపించే దైవత్వం అప్పటి వైద్యుల్లో ఉండేది. అందుకే, వైద్యులు దేవుళ్ళతో సమానమని కూడా అనేవారు. ఇప్పుడా రోజులు పోయాయి. నేటి ఆధునిక సమాజంలో ఆసుపత్రులకు డబ్బు జబ్బు పట్టింది. ఏదైనా చిన్న ఆరోగ్య సమస్యతో ఆసుపత్రికెళ్తే... పరీక్షల పేరుతోనే వేలాది రూపాయలు ఊడ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు తక్కువ ఖర్చుతో లభించే ఆయుర్వేదాన్ని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాల్సి ఉంది.

### ఆయువును పెంచే ఆయుర్వేదం :

అనారోగ్యాలను తొలగించి, ఆరోగ్యాన్ని పెంచి ఆయువును పెంచేదే ఆయుర్వేదం అంటారు మన పెద్దలు. వేలాది సంవత్సరాల ప్రాచీనకాలం నుంచి మనదేశంలో అందుబాటులో ఉన్న వైద్య విధానం అది. మనదేశానికి ఇదొక వరం లాంటిది. మహాభారత కాలం నుంచి ఈ వైద్యం ఉంది. కురుక్షేత్ర యుద్ధంలో గాయపడిన వేలాదిమంది యోధులకు ఆయుర్వేదం ద్వారా చికిత్సలందించినట్లు చరిత్ర చెప్తోంది. అత్యంత పురాతనమైన మన ఆయుర్వేదంలో, ప్రకృతి మనకు ప్రసాదించిన వనరుల నుంచి తయారుచేసే వేలాది రకాల దివ్యౌషధాలు అనేకం ఉన్నాయి.

చెట్ల ఆకులు, కాయలు, పండ్లు, వాటి వేళ్ళు, బెరడు అన్నీ ఔషధపరంగా ఉపయోగపడతాయని మన మహర్షులు ఎంతో శోధన చేసి మరీ గుర్తించారు. వనమూలికల నుంచి రకరకాల ఔషధాలను తయారుచేశారు. వ్యక్తుల ఆరోగ్యస్థితిగతులను బట్టి ఏ జబ్బుకు ఎలాంటి మందు ఇవ్వాలో నిర్దేశించారు. వాటినే ఔషధంగా మార్చి మాత్రలు, లేహ్యాలు, కషాయాలు, చూర్ణాల రూపంలో ఇచ్చేవారు. ఏ మోతాదులో ఏ మందు మింగితే జబ్బు తగ్గుతుందో వైద్యులు చెప్పేవారు. అవి ఎంతో అద్భుతంగా పనిచేస్తూ రోగాలను పూర్తిగా నయం చేసేవి. ఆరోగ్య పరిరక్షణకు ఆయుర్వేదం ఎంతో మంచిదనే పేరుండేది. రోగనిరోధక శక్తిని పెంచేందుకు, జీర్ణక్రియలను మెరుగుపరచేందుకు, శారీరక–మానసిక వత్తిడులను తగ్గించేందుకు ఆయుర్వేదంలో మంచి మందులున్నాయి.

కేవలం నామమాత్రపు ఖర్చుతోనే అప్పట్లో వైద్యులు ఈ మందులతో వైద్యం చేసేవారు. దీంతో, గ్రామగ్రామానా ఆయుర్వేద వైద్యం వర్ధిల్లుతుండేది. ఆయుర్వేద వైద్యవిధానం వల్ల ఇతరత్రా సమస్యలు(సైడ్ ఎఫెక్ట్స్) కూడా ఉండవు కనుక, ప్రజలు దీనిని బాగా ఇష్టపడేవారు. ఆధునిక కాలం వచ్చేసరికి, పాశ్చాత్య విషసంస్కృతి ప్రభావంతో దేశంలోని అన్ని వ్యవస్థలు అస్తవ్యస్థమైపోయాయి. ప్రాచీన సంప్రదాయ వైద్యవిధానాలు కనుమరుగయ్యాయి. క్రమేణా ఆయుర్వేదం కూడా ప్రజలకు దూరమైపోయింది. అయితే, ఇటీవలి కాలంలో ముఖ్యంగా 'కరోనా' వచ్చాక, సంప్రదాయ వైద్యవిధానాల పట్ల మళ్ళీ ప్రజలు ఆకర్షితులవుతున్నారు. కరోనా వంటి ప్రాణాంతక వ్యాధులను ఎదుర్కొనేందుకు అవసరమైన మందుల కోసం ఆయుర్వేదంలో ఎలాంటి మందులున్నాయో పరిశోధించి, ఆధునిక సమాజం మళ్ళీ వాటిపైనే ఆధారపడడం గమనార్హం.

### రోగాలను ఎదిరించే శక్తి కావాలి :

కరోనా రాకాసి ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమందికి సోకి, లక్షలాదిమంది చనిపోవడం తెలిసిందే. కంటికి కనిపించని క్రిమి ఏదో ఊపిరితిత్తుల్లోకి వచ్చి ఆరోగ్యాన్ని నాశనంచేసి, చివరికి ప్రాణాలనే తీస్తున్న అతి పెద్ద దారుణం బహుశా ఈ కలియుగంలో ఇదే. తాజాగా ఈ వ్యాధి మళ్ళీ విజృంభిస్తున్న నేపథ్యంలో, విషరోగాలను సైతం మట్టుబెట్టి, రోగాలను ఎదిరించి నిలిచే 'రోగనిరోధకశక్తి' ఇప్పుడెంతో అవసరం. జీవనశ్శైలిలో వచ్చే అనేకరకాల వ్యాధులను నియంత్రించేందుకు, శరీరంలో బలాన్ని కలిగించేందుకు ఆయుర్వేదంలో ఎన్నో మందులున్నాయి. వాటిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే గుర్తించి, ఏ మందుల వల్ల రోగాల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చో నిర్ధారించి, ఆయా మందులను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అంతేకాదు, ఆ మందులను అన్ని ప్రాంతాల్లోని పిల్లలకు, విద్యార్థులకు, యువతకు ఉచితంగా అందజేయడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. వీటన్నిటికంటే ముందు, ఆయుర్వేదానికి ప్రభుత్వాలు చేయూతనివ్వాలి. దేశంలో ఇప్పటికే ఉన్న ఆయుర్వేద వైద్యశాలల్లో ఉన్న వైద్యుల ఖాళీలను భర్తీ చేయాలి. మందులకు కొరత లేకుండా నిధులివ్వాలి. ఆయుర్వేదం పట్ల ప్రజలను మరింత చైతన్యవంతం చేసి, గ్రామగ్రామానా ప్రజలకు ఆయుర్వేద వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలి. కరోనా నివారణకు కోటానుకోట్ల రూపాయలు వెచ్చిస్తున్న ప్రభుత్వాలు, అలాంటి మాయదారి వ్యాధులను ఎదుర్కొనేందుకు ,అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను అన్వేషించాలి. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి నీడనిచ్చే చెట్లెన్నిటినో నాటుతున్నాం, వాటితో పాటు ఔషధ విలువలున్న వేప, రావి, కానుగ వంటి చెట్లను కూడా విస్తారంగా నాటితే, ఆ చెట్ల గాలులు అనారోగ్యాన్ని పారదోలుతాయని మన పెద్దలెప్పుడో చెప్పారు. ఇకనైనా ప్రభుత్వాలు అలాంటివాటిపై దృష్టిపెట్టాలి. ఆరోగ్యాన్ని, ఆయుష్షుని పెంచే ఆయుర్వేదాన్ని ప్రోత్సహిస్తే.. బాగుంటుంది!..

- రాజశ్రీ

# ప్రజల దాహార్తిని తీర్చడంలో..ఎంతో సంతృప్తి!

## • లింగసముద్రంలో 'అమృతధార' ప్రారంభోత్సవంలో విపిఆర్




పరిశుభ్రమైన మంచినీటి వసతులు లేక, దాహార్తితో ఇబ్బందులుపడుతున్న గ్రామీణ ప్రజలకు మేలు చేయాలనే లక్ష్యంతోనే తాము 'విపిఆర్ అమృతధార' కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఇప్పటిదాకా జిల్లాలోని అనేక గ్రామాల్లో వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటుచేసి ప్రజల దాహార్తిని తీర్చగలగడం తమకెంతో సంతోషాన్ని, సంతృప్తిని ఇస్తోందని నెల్లూరు ఎంపీ, విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, జల దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గంలోని మండలకేంద్రమైన లింగసముద్రంలోని ప్రజల కోసం ఆయన 'అమృతధార' కార్యక్రమాన్ని ప్రారంభించి అక్కడి మహిళలకు తాగునీటిని అందించారు. స్థానిక కేఆర్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'విపిఆర్ అమృతధార' కార్యక్రమంలో భాగంగా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేయించి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. తొలుత, పాఠశాల ఆవరణం వద్దకు చేరుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలకు విద్యార్థులు కోలాటంతో స్వాగతం పలికారు. అనంతరం వారు వాటర్‌ప్లాంట్‌కు స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు. మహిళలకు బిందెలతో నీటిని స్వయంగా అందించారు. ఈ సందర్భంగా వాటర్‌ప్లాంట్ భవన నిర్మాణ దాత, పాఠశాల పూర్వ విద్యార్థి అంగులూరి నరసింహారావును ఎంపీ వేమిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం, విపిఆర్ మాట్లాడుతూ, తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కందుకూరులో ఇప్పటివరకు ఒక వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని, ఇప్పుడు మరో రెండు వాటర్ ప్లాంట్లను ప్రారంభించామని చెప్పారు. కందుకూరుకు ప్రాధాన్యతనిస్తూ మరో 10 వాటర్ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ వాటర్ ప్లాంట్ వల్ల అటు విద్యార్థులతో పాటు గ్రామస్తులకు కూడా ఎంతో ఉపయోగంగా ఉంటుందని, దాదాపు రెండువేల మందికి మేలు జరుగుతుందని వివరించారు. ఎన్నికల్లో లింగ సముద్రం ప్రజలు తమకు మంచి మెజార్టీ ఇచ్చి గెలిపించారని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి తప్పకుండా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ, మెట్ట ప్రాంతమైన కందుకూరుకు విపిఆర్ అమృతధార వాటర్ ప్లాంట్లను కేటాయించినందుకు ఎంపీ వేమిరెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రస్తావించిన పలు సమస్యలను కూడా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆ తర్వాత, ఉలవపాడు మండలం కరేడులో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ప్రత్యేక పూజల అనంతరం వాటర్‌ప్లాంట్‌కు స్విచ్ ఆన్‌చేసి స్థానికులకు బిందెలతో నీటిని అందించారు.

### రాష్ట్రంలోనే తొలిసారిగా..

# యానాదుల కోసం 'సహకార సంఘం'




జిల్లాలోని ప్రాచీన గిరిజన తెగకు చెందిన యానాది కుటుంబాలను సమీకృతం చేసి, వారి జీవనోపాధులను మెరుగుపరచేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా రాపూరులో సహకార సంఘాన్ని ఏర్పాటుచేశారు. ఆమేరకు షెడ్యూలు తెగల వన్‌ధన్ వికాస్ కేంద్ర పరస్పర సహాయక సహకార సంఘాన్ని రిజిస్టర్ చేయడం కూడా జరిగిందని జిల్లా సహకారశాఖ అధికారి (డీసీఓ) బి.గురప్ప తెలిపారు. ఈనెల 27న నెల్లూరులోని తమ కార్యాలయంలో రాపూరుకు చెందిన యానాదిసభ్యులకు ఈ సహకార సంఘం రిజిస్ట్రేషన్‌పై అవగాహన కలిగించారు. సంఘ సభ్యులకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సంఘం వల్ల రాపూరు మండల పరిధిలోని వెలిగొండల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న సుమారు వెయ్యి యానాది కుటుంబాల వారికి మేలు జరుగుతుందని డీసీఓ తెలిపారు. ఆ అటవీప్రాంతంలోని కలపేతర అటవీ ఫలసాయాలు, ముడిసరుకుల ఉత్పత్తులను బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ సౌకర్యం కల్పించి వారికి ఆర్థిక సాధికారత కల్పించేందుకు కృషిచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాపూరు సబ్‌డివిజన్ సహకార అధికారి వి.రవికుమార్, డీసీఓ కార్యాలయం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్స్‌పెక్టర్ విజయలక్ష్మి, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

# 15 నుంచి..నర్రవాడలో బ్రహ్మోత్సవాలు



దుత్తలూరు మండలం నర్రవాడలో వెలసివున్న శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మవారి బ్రహ్మోత్సవాలు జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఎంతో ప్రసిద్ధమైన ఈ ఉత్సవాలకు భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు కనుక, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేయనున్నారు. ఈనెల 30న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, ఆలయ ఇఒ వి.ఉషశ్రీల ఆధ్వర్యంలో ఏర్పాట్లపై సమీక్ష జరుగుతుందని ఆలయవర్గాలు తెలిపాయి.

# అర్జీలు ఇస్తున్నాం కానీ..



# సమస్యలు తీరడం లేదు

## • ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎంతగా కృషి చేస్తున్నా, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదు. అర్జీలైతే ఇస్తున్నాం కానీ, తమ బాధలు తీరడం లేదంటూ ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చి ఉన్నతాధికారులకు మొర పెట్టుకుంటూనే ఉన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా తమ సమస్యలు తీరుతాయని జిల్లా నలుమూలల నుంచి ఎంతో వ్యయప్రయాసలతో వచ్చే ప్రజలు, ఉన్నతాధికారులు ఆసాంతం తమ సమస్యలు విని స్పందించి కిందిస్థాయి అధికారులకు ఆదేశాలిస్తున్నా క్షేత్రస్థాయికి వచ్చేసరికి ఆ పనులు జరగడమే లేదని బాధపడుతున్నారు. ఎంతోకాలంగా ఈ పరిస్థితిలో మార్పు లేదని అనేకమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొన్నటికి మొన్న ఈనెల 26 సోమవారం నాడు జిల్లాస్థాయిలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలకు పెద్దసంఖ్యలోనే అర్జీలు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డిఆర్ఓ ఉదయభాస్కర్, డీపీఓ శ్రీధర్, జడ్పీ సీఇఒ విద్యారమ తదితరులు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆ ఒక్కరోజునే 407 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. వాటిలో ప్రధానంగా రెవెన్యూ శాఖకి సంబంధించిన అర్జీలు 133 వరకు ఉన్నాయి. ఆ సమస్యలతోపాటు, ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను కూడా అధికారులు జాప్యం లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ మరోసారి ఆదేశించారు.

**నగర కార్పొరేషన్‌కు 66 ఫిర్యాదులు :**

అదేవిధంగా, నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ వై.ఓ. నందన్ ఆధ్వర్యంలో, ఈనెల 26న జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 66 ఫిర్యాదులను అందుకున్నారు. ప్రధానంగా టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులకు పలు కారణాలతో బ్యాంకుల నుంచి రుణాలు అందడం లేదని, వారు చెల్లించిన మొత్తాలను తిరిగి ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు. డ్రైనేజీ సమస్యలు, తాగునీటి సరఫరా పనులు, పారిశుధ్యం తదితర సమస్యలపై వచ్చిన అర్జీలను ఆయన పరిశీలించి, ఆ సమస్యలన్నిటినీ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

**పోలీసుశాఖకు మరో 100 అర్జీలు :**

పోలీసు శాఖకు కూడా ఈసారి మరో వంద అర్జీలు వచ్చాయి. పోలీస్‌స్టేషన్‌లలో తగు న్యాయం జరగడం లేదంటూ పలువురు బాధితులు జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు మొర పెట్టుకున్నారు. నెల్లూరు పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో నగర డీఎస్పీ సింధుప్రియ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పలురకాల మోసాలు, నేరాలు, దౌర్జన్యాలతో బాధితులు ఇబ్బందులు పడుతున్న విషయాలను గ్రహించి వెంటనే వారి సమస్యలు తీర్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను ఆదేశించారు. ఏదేమైనప్పటికీ, జిల్లాస్థాయిలో ఉన్నతాధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం సమస్యలు తీరడం లేదనే ఆవేదన సర్వత్రా బాధితుల్లో వినిపిస్తోంది. ప్రత్యేకించి ఎప్పటికప్పుడు అర్జీల పరిష్కారం ఎంతవరకు వచ్చిందో, ఎక్కడ ఇబ్బంది ఉంటోందో పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులుంటే తప్ప, ఈ సమస్యలు ఒక కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదని కూడా వారు అభిప్రాయపడుతున్నారు.

# 2న..సీపీఐ ధర్నాలు



పేదల సంక్షేమం కోసం సీపీఐ పోరాటాలు చేస్తూనే ఉంటుందని, జూన్ 2న జిల్లాలోని అన్ని మండలాల్లో సీపీఐ (భారత కమ్యూనిస్టు పార్టీ) ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహిస్తామని ఏపీ రైతుసంఘం అధ్యక్షుడు షానవాజ్ చెప్పారు. ఈనెల 27న ముత్తుకూరులోని సీపీఐ కార్యాలయంలో ఆమేరకు గోడపత్రికలు ఆవిష్కరించారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి టీడీపీ నాయకులు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా పేదలందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

### పెద్దాసుపత్రిలో

# కరోనా వార్డు

దేశంలో, రాష్ట్రంలో మళ్ళీ కరోనా మహమ్మారి వ్యాధి కలవరం పుట్టిస్తున్న నేపథ్యంలో, నెల్లూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (పెద్దాసుపత్రి)లో ముందు జాగ్రత్త చర్యగా ప్రత్యేకంగా 30 పడకలతో కరోనా వార్డును ఏర్పాటుచేశారు. అయితే, జిల్లాలో ఇప్పటివరకు ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాలేదు. అయినప్పటికీ ఆ వ్యాధి వస్తే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలంటూ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ జిల్లా అధికారులకు ఇటీవల ఆదేశాలు జారీచేయడంతో, కరోనా నియంత్రణకు అవసరమైన పరికరాలను సిద్ధం చేశారు. వెంటిలేటర్లు, కరోనా పరీక్షలుచేసే కిట్‌లు అందుబాటులో ఉంచారు. పెద్దాసుపత్రిలోని పల్మనాలజీ విభాగంలో ఆ మేరకు కరోనా వార్డును ఏర్పాటుచేశారు. ఎవరికైనా ఆ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు అనుమానం వస్తే, వెంటనే వచ్చి వైద్యులను సంప్రదించాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ సూచించారు.

# 4, 5 తేదీలలో.. పెన్షన్, జీపీఎఫ్ కేసుల అదాలత్

పెండింగ్‌లో ఉన్న పెన్షన్ కేసులు, జీపీఎఫ్ కేసులను సమీక్షించి పరిష్కరించడానికి జూన్ 4, 5 తేదీలలో నెల్లూరు, వింజమూరులలో పెన్షన్ మరియు జీపీఎఫ్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు మరియు జీపీఎఫ్ చందాదారులకు సేవలను సకాలంలో సమర్థవంతంగా అందించడం కోసం జిల్లాలోని డీడీఓలకు విజయవాడ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం వారు అవగాహన కల్పిస్తారని తెలిపారు. పెన్షన్ కేసులు, జి పి ఎఫ్ కేసులను పరిష్కరించడానికి జూన్ 4న నెల్లూరులో, 5 వ తేదిన వింజమూరులో పెన్షన్ అదాలత్ నిర్వహిస్తారన్నారు. జిల్లా ట్రెజరీ అధికారిని నోడల్ అధికారిగా నియమిస్తున్నట్లు వివరించారు.

# నెల్లూరు కబుర్లు

## దివ్యాంగులకు ట్రై సైకిళ్ల అందజేత



జిల్లా వ్యాప్తంగా వందలాదిమంది దివ్యాంగులను ఆదుకుంటున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల నెల్లూరులోని తమ నివాసంలో నలుగురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందచేశారు. నడవలేక అవస్థలు పడే ప్రతి ఒక్క దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందచేయడం విపిఆర్ ఫౌండేషన్ లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. కొడవలూరు మండలం యల్లాయపాలెంకు చెందిన చెంచయ్య, ముదివర్తికి చెందిన కోటయ్య, ఇందుకూరుపేట మండలం దేవిస్‌పేటకి చెందిన మనోహర్, సోమశిలకు చెందిన కామేశ్వరిలకు విపిఆర్ ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ళు అందజేశారు. వాటిని అందుకున్న దివ్యాంగులు విపిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా 'యోగాంధ్ర'



నెల్లూరు నగరంలో యోగాంధ్ర కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు జూన్ 21వ తేదీ వరకు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల నగరంలోని పలు పార్కుల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగా గురువులు అభ్యాసకులకు యోగాపై అవగాహన కల్పించి యోగసనాలు వేయించారు. యోగాను దినచర్యగా మార్చుకోవాలన్నదే యోగాంధ్ర లక్ష్యంగా వివరించారు. ప్రతిఒక్కరూ యోగా అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని జూన్ 21న విశాఖపట్టణంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే అంతర్జాతీయ యోగా దినోత్సవ లక్ష్యాన్ని నెరవేర్చడంలో భాగస్వాములు కావాలని యోగా గురువులు రమేష్, రవీంద్ర, స్వప్న తదితరులు కోరారు.

## ఆధార్ సీడింగ్ తప్పనిసరి

పోస్టల్‌శాఖ ద్వారా పించన్లు, ప్రభుత్వ పథకాలు పొందుతున్న లబ్ధిదారులు వెంటనే ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని నెల్లూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ ఈనెల 26న ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ సీడింగ్, బ్యాంక్ లింకింగ్, మ్యాపింగ్ చేయించుకోకుండా ఉన్న లబ్ధిదారులకు పింఛను, ప్రభుత్వ పథకాలను నిలిపివేసేందుకు అవకాశం ఉంటుందని, కనుక లబ్ధిదారులు వెంటనే ఆధార్ సీడింగ్ చేయించుకోవాలని ఆయన కోరారు.

## ముఖ్యమంత్రికి.. ధన్యవాదాలు - ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోవూరు నియోజకవర్గానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చంద్రబాబునాయుడు 2కోట్ల 35 లక్షలు అందజేశారని, ఏడాది కాలంలో 11సార్లు సిఎం ఆర్‌ఎఫ్ చెక్కులు ఇచ్చి పేదలను ఆదుకున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. బాధితుల పట్ల మానవత్వంతో స్పందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలని ఆమె అన్నారు. ఇటీవల నెల్లూరు నగరంలోని తమ నివాసంలో 17మందికి 19 లక్షల 50 వేల రూపాయల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆమె బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటివరకు 170 మంది నిరుపేదలైన అనారోగ్య పీడితులను ఆదుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు, బుచ్చి రూరల్ టీడీపీ మండలాధ్యక్షులు ఏకొల్లు పవన్‌కుమార్ రెడ్డి, నాపా వెంకటేశ్వర్లునాయుడు, శ్రీహరిరెడ్డి, బెజవాడ జగదీష్, టీడీపీ నాయకులు సూరా శ్రీనివాసులురెడ్డి,జనసేన నాయకులు గుడి హరికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



### ఎన్టీఆర్‌కి..
## ఆరంబాకం నివాళి



తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక.. తెలుగుదేశం పార్టీ అధినేత.. స్వర్గీయ నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా ఈనెల 28న నెల్లూరు మూలాపేట అలంకార్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహ స్థాపకులు, ఎన్టీఆర్ అభిమాని ఆరంబాకం చంద్రశేఖర్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ఇవ్వాలని, ఎన్టీఆర్ మ్యూజియం ఏర్పాటు చేయాలని, మద్రాసులోని ఎన్టీఆర్ నివాసాన్ని ప్రజలు సందర్శించుకునేలా ఏర్పాటు చేయాలని, జిల్లాలోని తెలుగు గంగ డ్యామ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

### శ్రీ రామకృష్ణ సేవాశ్రమానికి..
## 1న ప్రముఖ స్వామీజీల రాక

నెల్లూరులోని నవలాకులతోటలో ఉన్న శ్రీ రామకృష్ణ సేవాశ్రమానికి జూన్ 1న పలువురు ప్రముఖ స్వామీజీలు రానున్నారు. ఆ ఆశ్రమాన్ని బేలూరులోని రామకృష్ణ మిషన్‌కు అప్పగిస్తున్న సందర్భంగా ఆరోజు ఉదయం 9.30 గంటలకు పూజలు, భజనలు జరుగుతాయని, భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస విగ్రహం పునఃప్రతిష్ఠ మహోత్సవం కూడా జరుగుతుందని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. బేలూరు మఠానికి చెందిన రామకృష్ణ మఠం అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ పూజ్యస్వామీజీ శ్రీ తత్త్వ విదానందజీ మహరాజ్, తిరుపతిలోని రామకృష్ణ మిషన్ కార్యదర్శి శ్రీ సుకృతానందజీ మహరాజ్, బేలూరు రామకృష్ణ మఠం గవర్నింగ్ బాడీ ట్రస్టీ..పూజ్యశ్రీ జ్ఞానవ్రతానందజీ మహరాజ్ తదితరులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రముఖ నేతలు, ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొననున్నట్లు వారు చెప్పారు. శ్రీ రామకృష్ణ సేవాశ్రమం ప్రతినిధులు, భక్తులు, శ్రేయోభిలాషులంతా ఈ కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు.

## స్కానింగ్ సెంటర్లు.. నిబంధనలు పాటించాలి

**- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డా. సుజాత -**



జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు వైద్యుల సిఫార్సులు లేకుండా ఎట్టి పరిస్థితులలోనూ స్కానింగ్ పరీక్షలు చేయకూడదని, జిల్లాలోని స్కానింగ్ సెంటర్‌లపై తనిఖీలు ముమ్మరంగా ఉంటాయని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డా. సుజాత స్పష్టం చేశారు. ఈనెల 27న ఆమె నగరంలోని తమ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా ఆర్‌ఎంపీలు స్కానింగ్ పరీక్షలకు రిఫర్ చేయకూడదని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి సలహా సంఘం చైర్‌పర్సన్‌గా గైనకాలజిస్ట్ డా.సి.హెచ్ కిరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పరిమళ, డాక్టర్ సర్దార్ సుల్తానా, డిఐఒ డాక్టర్ ఉమామహేశ్వరి, డివిజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.పి ఎల్ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

### క్యారమ్స్ అసోసియేషన్
## కార్యదర్శిగా.. శ్రీనివాసులు



క్యారమ్స్ అసోసియేషన్ జిల్లా శాఖ కార్యదర్శిగా పి. శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం అధ్యక్షుడు శ్రీమన్నారాయణ ఇటీవల ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కూడా శ్రీనివాసులు కార్యదర్శిగా పనిచేసి, ప్రస్తుతం జిల్లా ఉపాధ్యక్షునిగా సేవలందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు క్లబ్ కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, రంజీ మాజీ క్రీడాకారుడు మలిరెడ్డి కోటారెడ్డి, నెల్లూరు క్లబ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జట్టి సురేష్ రెడ్డి, క్యారమ్స్ జిల్లా కమిటీ సభ్యుడు మద్దిన విశ్వనాథ్, సహాయ కార్యదర్శులు షేక్ నజీర్ బాషా, కె. శ్రీనివాసులురెడ్డి, జి. రామ్మోహన్ తదితరులు శ్రీనివాసులును అభినందించారు.

## ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు సరస్వతీనగర్‌లో ఇటీవల చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ వారి ఆధ్వర్యంలో కొత్తగా ప్రారంభించిన చెన్నై హాస్పిటల్ పాలిక్లినిక్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ శిబిరంలో పాల్గొని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆసుపత్రి అధినేత ఎస్వీ రమేష్ బాబు, సిబ్బంది ఆధ్వర్యంలో రోగులకు బీపీ, ఈసీజీ, ఎకో పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసరమైన సలహాలు సూచనలు అందజేశారు.

## హాస్టళ్ల బాగుకు చర్యలు

గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో..ఎస్సీఎస్టీ బీసీ హాస్టళ్లలో ఎలాంటి వసతులు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని, కూటమి ప్రభుత్వం ఆ హాస్టళ్లలో వసతులు కల్పించేందుకు ఇటీవల 87.12 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసింది. దీంతో, నెల్లూరు నగరంలో ఉన్న 11 హాస్టళ్లలో ఆ మేరకు భవనాల మరమ్మత్తులు, స్నానాల గదులు, తలుపులు-కిటికీలు బాగుచేయడం, ఫ్యాన్ల ఏర్పాటు, నీటివసతులు కల్పించడం తదితర పనులు చేపట్టారు.

## పురోహితుల సంఘం కార్యవర్గం

జిల్లా పురోహితుల సంఘం కార్యవర్గ సమావేశం ఇటీవల నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా ప్రసాద్‌శర్మ, ప్రధాన కార్యదర్శిగా సతీష్‌శర్మ, కోశాధికారిగా నరసింహారావు, ఉపాధ్యక్షునిగా నాగరాజశర్మ ఎన్నికైనట్లు ఆ సంఘం వారు తెలిపారు.






## ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో.. ఎన్టీఆర్ జయంతి



మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి కార్యక్రమాన్ని ఈనెల 28న నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్‌కు, క్రీడాకారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి-కాకినాడ, 2022 ప్రెసిడెంట్ ఎం.వి సుబ్బారెడ్డి, ఎం. వెంకటాద్రిరెడ్డి, పీడీజీలు పలగాటి శ్రీనివాసులురెడ్డి, ఎస్.రాఘవేంద్రశెట్టి, ఏకొల్లు రాఘవరెడ్డి, మాజీ ప్రెసిడెంట్.. వాకర్స్ ఇంటర్నేషనల్ 203 డిస్ట్రిక్ట్ ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభావతిని వాకర్స్ సభ్యులు శాలువాతో సత్కరించి, మెమెంటో బహుకరించారు. తర్వాత నైజాం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

## విపిఆర్ సారధ్యంలో..

# అట్టహాసంగా నెల్లూరు మినీ మహానాడు



నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) సారధ్యంలో ఇటీవల నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ మినీ మహానాడు అదిరిపోయింది. కనుపర్తిపాడు వద్దనున్న విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలిరావడంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది. ప్రాంగణమంతా పసుపు జెండాలతో రెపరెపలాడింది. జై తెలుగుదేశం అంటూ కార్యకర్తలు పెద్దపెట్టున చేసిన నినాదాలతో కన్వెన్షన్ సెంటర్ దద్దరిల్లిపోయింది. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సభా వేదిక హోరెత్తిపోయింది.

### మనందరిదీ ఒకే కుటుంబం - ఎంపీ వేమిరెడ్డి

ఎంతో ఉత్సాహంగా జరిగిన ఈ మినీ మహానాడులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, మనందరిదీ ఒకే కుటుంబమని, మనది తెలుగుదేశం కుటుంబమనీ అంటూ, తెలుగుదేశం పార్టీ నేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని పెంచిన గొప్ప వ్యక్తి ఎన్టీ రామారావు అని, ఆ తర్వాత ప్రపంచంలోనే తెలుగు వారికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఘనత చంద్రబాబునాయుడుకి దక్కుతుందని అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కష్టకాలంలో చాలా ఇబ్బందులు పడ్డారని, అలాంటి వారికి ఎంపీగా తప్పకుండా తాను అండగా నిలబడతానన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త పాత నాయకుల కలయికతో పార్టీ ముందుకు సాగాలన్నారు. ఒక్క క్షణం తీరిక లేకుండా కష్టపడి పనిచేసే తత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదని అన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, కేంద్రం నుంచి నిధులు తీసుకువస్తున్నారని, త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు కూడా రానున్నాయని తెలిపారు. భవిష్యత్తులో యువనేత నారా లోకేష్ నాయకత్వంలో పార్టీ మరింత ముందుకు సాగుతుందని వెల్లడించారు. ప్రతి ఒక్కరు కలిసికట్టుగా రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు.

### టీడీపీని నడిపించే సత్తా.. లోకేష్‌కే ఉంది

**- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**

అధికారంలో ఉన్నా లేకున్నా తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమం పట్ల లోకేష్ ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటారని, చంద్రబాబు నాయుడును అన్యాయంగా జైల్లో పెట్టినప్పుడు న్యాయం కోసం పోరాడి తండ్రిని జైల్లోంచి విడిపించి తీసుకొచ్చి తన పరిణితి చాటుకున్న ఘనత మంత్రి లోకేష్‌దని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కొనియాడారు. టీడీపీని ముందుకు నడిపించగల సత్తా.. లోకేష్‌బాబుకే ఉందన్నారు. ప్రజలే దేవుళ్ళు..సమాజమే దేవాలయం అనే స్ఫూర్తితో స్థాపించిన తెలుగుదేశం పార్టీతో ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పాలన మొదలైందని, చంద్రబాబు నాయకత్వంలో తాము పనిచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేశంలోనే ఇప్పుడు 4 వేల రూపాయలు పెన్షన్ అందజేస్తున్నది ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అన్నారు. పెన్షన్ పంపిణికి ప్రభుత్వం ఏటా 2 వేల 700 కోట్లు వెచ్చిస్తుందన్నారు. జూన్ 12 నుంచి మరో లక్ష మంది వితంతువులకు ప్రభుత్వం పెన్షన్ ఇవ్వనున్నట్లు ఆమె ప్రకటించారు. సూపర్ సిక్స్‌తో సహా ఎన్నికల సందర్భంగా చేసిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేరుస్తారన్నారు. గత వైకాపా ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల కారణంగా కావలి రెవెన్యూ డివిజన్‌లో కలిపిన విడవలూరు, కొడవలూరు మండలాలను తిరిగి నెల్లూరు రెవెన్యూ డివిజన్‌లో కలిపేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. అదేవిధంగా, కోవూరు, పడుగుపాడు, పోతిరెడ్డిపాళెం గ్రామ పంచాయతీలను విలీనం చేసి కోవూరు మున్సిపాలిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రాలలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటుతో పాటు, ప్రతి మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాల నిర్మాణానికి కృషిచేస్తామని తెలిపారు.

తొలుత, జిల్లా టీడీపీ అధ్యక్షులు..రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు.

# దేశానికే దిక్సూచిగా..చంద్రబాబు విజన్



**- ఎమ్మెల్యే సోమిరెడ్డి**

టీడీపీలో ఎన్టీఆర్ బ్రాండ్ కొనసాగుతోందని, దేశానికే దిక్సూచిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి విజన్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోందని సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో ఇటీవల నిర్వహించిన టీడీపీ జిల్లా మహానాడులో ఆయన మాట్లాడుతూ, గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఐటీ అభివృద్ధి విషయంలో చంద్రబాబునాయుడిని ఫాలో అయ్యానని పీఎం నరేంద్రమోదీ చెప్పడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణమన్నారు. ఇప్పుడు మూడో తరంలో యువ నాయకుడు నారా లోకేష్ బాబు నాయకత్వంలో పనిచేసే అవకాశం కూడా తమకు దక్కిందని, ఇటీవల నెలకొన్న యుద్ధపరిస్థితుల్లోనూ నారా లోకేష్‌బాబు కుటుంబానికి నరేంద్ర మోదీ రెండు గంటల పాటు ఆతిథ్యమివ్వడం గొప్ప విషయమని అన్నారు. లోకేష్ బాబులోని నాయకత్వ లక్షణాలు, పోరాటపటిమ, రాష్ట్ర అభివృద్ధి కోసం పడుతున్న తపనను మోదీ గుర్తించారన్నారు. ఏపీ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమం విషయంలో తాత, తండ్రికి దీటుగా లోకేష్ బాబు రాణిస్తున్నారని అన్నారు. ఆ మూడు తరాల నాయకులతో కలిసి పనిచేసే అవకాశం తనకు లభించిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పేదలకు కూడు, గూడు, గుడ్డ ఉండాలని తపించిన పెద్దాయన ఎన్టీఆర్‌ను భారతరత్నతో గౌరవించాలని ఆయన కోరారు. రానున్న 2029 ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించి నారా చంద్రబాబు నాయుడిని మరో సారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదిద్దామని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

### జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం నాశనం:

జగన్ రెడ్డి పాలన సాగిన ఐదేళ్లలో రాష్ట్రం సర్వనాశనమైపోయిందని సోమిరెడ్డి ఈ సందర్భంగా ధ్వజమెత్తారు. వైకాపా హయాంలో రూ.3200 కోట్ల మద్యం కుంభకోణం జరిగినట్లు సిట్ పక్కా ఆధారాలతో తేల్చిందని, అధికారిక విక్రయాలతో రూ.3200 కోట్ల అవినీతి జరిగితే, అనధికారికంగా జరిపిన విక్రయాల రూపంలో రూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగి ఉంటుందని ఆయన విమర్శించారు. మద్యం స్కామ్‌లో అడ్డంగా దొరికిపోయిన పరిస్థితుల్లో మన గురించి జగన్ రెడ్డి విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. ఈ రోజు దేశంలోని ఏ మద్యం కంపెనీ అయినా రాష్ట్రంలో స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే అవకాశం ఏపీలో ఉందని, గతంలో ఆ పరిస్థితి లేదన్నారు. వైకాపా ప్రభుత్వం ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడి విక్రయించిన నాసి రకమైన మద్యం తాగి ఎందరో ప్రాణాలు కోల్పోయారని, వేలాది మంది అనారోగ్యం పాలయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అరాచకాలు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వ్యక్తి ఈరోజు గంటల తరబడి పచ్చి అబద్ధాలు చెబుతున్నాడని, త్వరలోనే ఆ పార్టీ కనుమరుగైపోతుందని ఆయన జోస్యం చెప్పారు.

# రాష్ట్ర పండుగగా..ఎన్టీఆర్ జయంతి



మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా మే 28న రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ ఈనెల 27న ఆమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్టీఆర్ జయంతిని జరుపుకోవడం ద్వారా ఆయన జ్ఞాపకాలకు తగిన గౌరవం ఉంటుందని, అధి కారులందరూ ఆ మహనీయుని జయంతిని ఆరోజున రాష్ట్ర పండుగగా నిర్వహించాలని సూచించారు.

## పార్టీ కోసం..

# కష్టపడే వారికి ప్రాధాన్యత

**- మంత్రి నారాయణ**



ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి, పార్టీ కోసం కష్టపడే వారికే పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల నగరంలోని మెడికల్ కాలేజీ క్యాంపు కార్యాలయంలో ఆయన పార్టీ డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. నెల్లూరు నగర పరిధిలోని 5 ప్రముఖ దేవాలయాల కమిటీ చైర్మన్‌లు, పాలకమండలి సభ్యుల ఎంపికపై చర్చలు జరిపారు. అందరి అభిప్రాయాలను తీసుకొని.. పారదర్శకంగా పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అన్ని కులాలు తనకు సమానమేనని అంటూ, పదవుల కేటాయింపుల్లో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తప్పకుండా మంచి పదవులే వస్తాయని భరోసా ఇచ్చారు.

### అధికారుల చుట్టూ తిరగకుండానే అనుమతులు :

మున్సిపల్ అనుమతుల కోసం అధికారులు, నాయకులు చుట్టూ తిరిగే పరిస్థితుల నుండి నేరుగా దరఖాస్తుదారుని ఇంటి వద్దకే వచ్చి అనుమతులు మంజూరుచేసే విధానాన్ని తీసుకువస్తున్నట్లుగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నారాయణ తెలిపారు. ఇటీవల ఆయన నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న టౌన్‌ప్లానింగ్ అనుమతులపై టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత తదితరులతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఇబ్బంది కలగని రీతిలో పురపాలక శాఖలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని, లే అవుట్ అనుమతులు, బిల్డింగ్ అనుమతులు వగైరాల కోసం ప్రజలను ఇబ్బంది పెట్టకుండా చేయడం ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత అని మంత్రి చెప్పారు. గతంలో అనుమతుల కోసం ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చిన ఘనత తమదేనన్నారు. అవసరమైన అన్ని డాక్యుమెంట్లు అందించిన దరఖాస్తుదారులకు 72 గంటల్లో అనుమతులు మంజూరు చేయాలన్నారు. అవసరమైన పత్రాలు సమర్పించని దరఖాస్తుదారులకు ప్రత్యేక కమిటీలు నేరుగా వారి ఇళ్ల వద్దకే వెళ్లి పరిశీలించి అక్కడికక్కడే అనుమతులు మంజూరు చేసే విధానాన్ని తీసుకువస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర టౌన్‌ప్లానింగ్ అడిషనల్ డైరెక్టర్లు వరప్రసాద్, శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నందన్ పాల్గొన్నారు.

# కావలి ఆర్టీసీకి అవార్డు

ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపోకి ఇంధన అవార్డు లభించింది. ఒక లీటర్ డీజిల్‌కి 5.98 కిలోమీటర్ల మైలేజీని సాధించినందుకు ఆ డిపోకి ఆర్టీసీ వైస్‌ఛైర్మెన్ ఇంధన సామర్థ్య అవార్డును ప్రకటించడం విశేషం. ఈ సందర్భంగా ఈనెల 27న కావలి ఆర్టీసీ డిపోలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారి మురళీబాబు పాల్గొని, డిపో మేనేజర్ శ్రీనివాసులకు అవార్డును అందజేశారు. 2024-25 సంవత్సరానికి గాను కావలి డిపోకి నిర్ధేశించిన ఇంధన పొదుపు లక్ష్యం సాధించినట్లు ఆయన చెప్పారు.




## నాలుగో ర్యాంకు సరే...
# అసమానతల సంగతేమిటి?

మనసులో మాట 47

ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందా? లేదా? అన్న విషయంలో ఇప్పుడు స్పష్టత కొరవడింది. నాలుగు ట్రిలియన్ డాలర్ల జీడీపీతో నాలుగో పెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం అవతరించిం దని ఇటీవల నీతిఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ప్రకటించగా ప్రధాని నరేంద్రమోదీ సహా రాజకీయ, రాజ కీయేతర ప్రముఖులందరూ హర్షం వ్యక్తం చేస్తూ ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తమ స్పందనలు తెలియజేశారు. ఇప్పటివరకు ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న మనం జపాన్‌ను దాటి నాలుగోస్థానంలో నిలిచామని బీవీఆర్ సుబ్రమణ్యం ప్రకటించారు. మనకన్నా ముందు అమెరికా, చైనా, జర్మనీ ఉన్నాయన్నారు.

### వెల్లడవుతున్న భిన్నాభిప్రాయాలు..

అయితే, భారత్ ఇంకా నాలుగో స్థానానికి చేరుకోలేదని నీతి ఆయోగ్ సభ్యుడు అరవింద్ వీర్‌మణి చెప్పినట్లు వార్తలు వచ్చాయి. మరికొంత మంది ఆర్థికవేత్తలు కూడా మనం ఇంకా నాలుగో స్థానానికి చేరుకోలేదని చెప్పారు. నాలుగో స్థానానికి చేరుకునే దిశగా మనం వెళ్తున్నామని, 2025 చివరి నాటికి గాని మనం నాలుగో స్థానానికి చేరుకోబోమని ఆయన స్పష్టం చేశారు. 2025 సంవత్సరంలో మొత్తం 12 నెలల జీడీపీ డేటా లెక్కిస్తే కానీ ప్రక్రియ పూర్తికాదని ఆయన వివరించారు. అప్పటివరకు నాలుగో స్థానమన్నది అంచనా మాత్రమే అన్నారు. నీతి ఆయోగ్ ఛైర్మన్ ఒక రకంగా, సభ్యుడు మరో రకంగా చెప్పడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఐఎంఎఫ్ గణాంకాలు పరిశీలిస్తే ఇంకా మనం నాలుగోస్థానానికి చేరుకోలేదని అర్థమవుతోంది. ఇంతటి ముఖ్యమైన విషయంలో దేశం తరఫు నుంచి ఒకటే ప్రకటన వెలువడాలి కానీ భిన్నాభిప్రాయాలు వెలువడడం మనల్ని మనం పలుచన చేసుకోవడమే. ఈ గందరగోళం సంగతి ఎలా ఉన్నా ఈ ఏడాది చివరికి మనం నాలుగో స్థానానికి చేరుకోవడం తథ్యమే. మోదీ 11ఏళ్ల పరిపాలన కాలంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయిన మాట గణాంకాల బట్టి నిజమే.

### అసలు వాస్తవ పరిస్థితి ఏమిటి?

ఆర్థిక శక్తుల జాబితాలో పైకి ఎగబాకడం వల్ల వాస్తవంగా దేశంలో వస్తున్న మార్పు ఏమిటి? ఇది అసలు చర్చనీయాంశం. 3.9 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను దేశంలోని 140 కోట్ల మంది తలసరి ఆదాయంగా లెక్కగడితే ఒక్కొక్కరి వాటా 2,711 డాలర్లు. వాస్తవంగా మన ప్రజల వద్ద ఒక్కొక్కరికి అంత ఆదాయం ఉందా? మరో పోలిక చూద్దాం. ఒక గదిలో 10 మంది ఉంటే వారిలో తొమ్మిది మంది వద్ద ఒక్కొక్కరికి వెయ్యి రూపాయిలున్నాయనుకుందాం. మరొకరి వద్ద 91వేల రూపాయిలున్నాయనుకుందాం. మొత్తం కలిపితే లక్ష రూపాయలవుతుంది. అంటే సగటున ఒకొక్కరి వద్ద రూ.10వేలు ఉన్నట్లు. వాస్తవానికి పది మందిలో తొమ్మిది మంది వద్ద– ఒక్కొక్కరికి ఉన్నది రూ.వెయ్యి మాత్రమే. మరో వ్యక్తి వద్ద మాత్రమే పెద్ద మొత్తంలో సొమ్ము ఉంది. జీడీపీ లెక్కలు కూడా అలాగే ఉంటాయి. దేశ జీడీపీ ఘనంగా ఉన్నంత మాత్రాన ప్రజలందరి వద్దా డబ్బు గలగల లాడుతుందని అర్థం కాదు. ఆక్స్ ఫాం –2023 నివేదిక ప్రకారం దేశంలో ఒక శాతం అత్యంత సంపన్నుల వద్ద దేశంలోని మొత్తం సంపదలో 40.5శాతం పోగుపడి ఉంది. 70 కోట్ల మంది ప్రజలు – అంటే దేశంలో దాదాపు సగం జనాభా దేశ సంపదలో 3శాతం సంపదను పంచుకుంటున్నారు. అంటే కోట్లమంది ప్రజలు ఎంతటి పేదరికంలో మగ్గుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

మరోవైపు చూస్తే.. దేశానికి జీఎస్టీ రూపంలో అందుతున్న రాబడిలో దాదాపు 64శాతం వరకు ఆదాయంలో దిగువన ఉన్న 50శాతం మంది నుంచే వస్తోందని నివేదికలు చెబుతున్నాయి. సంపన్నుల వద్ద వసూలు చేస్తున్న కార్పొరేట్ పన్నును మాత్రం తగ్గిస్తున్నారు. ఈ అసమానతల కారణంగా.. చెల్లింపు సామర్థ్యం ఉన్న వారిపై ఆర్థిక భారం పడుతోంది.

### పెరుగుతూనే ఉన్న ఆర్థిక అసమానతలు..

2021–22 ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ లాభాలు 70శాతం పెరగగా దేశంలోని 84శాతం కుటుంబాల ఆదాయం తగ్గిందని ఆక్స్ ఫాం నివేదిక చెబుతోంది. ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతున్నా ఆర్థిక అసమానతలు తగ్గలేదని దీన్ని బట్టి అర్థమవుతోంది. దేశ ఆర్థికవ్యవస్థ బలోపేతం కావాల్సిందే. అందరం ఈ విషయంలో సంతోషించాల్సిందే. అదే సమయంలో బలపడుతున్న ఆర్థిక వ్యవస్థ తాలూకు ఫలాలు ప్రజలందరికీ అందాల్సిన అవసరం ఉంది. అందుకు తగ్గ ప్రణాళికలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలి. ఈ విషయంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిపాదించి అమలు చేస్తున్న పీ4విధానం కొంత పరిష్కారం చూపించవచ్చు. సంపన్నులు తమ సంపదను సమాజంలో అవసరార్థుల కోసం ఉపయోగిస్తే అసమానతలు తొలగిపోతాయి. పేదలు, దిగువ మధ్య తరగతి వారు తమ కాళ్లపై తాము నిలబడేలా, హుందాగా జీవించగలిగే స్థాయి ప్రమాణాలు తమంతట తాము అందుకునేలా ఆర్థిక ఆసరాను సంపన్నులు కల్పిస్తే ఆర్థిక వ్యవస్థ సమతౌల్యంగా ఉంటుంది. ఆర్థికవ్యవస్థ సమతౌల్యంగా ఉంటే.. సమాజం నిర్మాణాత్మకంగా, బలంగా ఉంటుంది.

ఏదేమైనా.. భారత్ ప్రబల శక్తిగా అవతరించాలంటే ఆర్థిక సమతౌల్యం అత్యవసరం. నీతిఆయోగ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**



# జానకిరామ.. రామాయణం 67

- ఊటుకూరు జానకి రామారావు



లక్ష్మణా ! ఎవ్వరులేకుండా నేను ఒక క్షణమైనా జీవించ లేను. నా సీత ఎక్కడ?

నన్ను విడిచి ఉండలేక నన్ను అనుసరిస్తూ వచ్చిన నా సీతను ఒంటరిగా వదలి వచ్చావా?

నా ప్రాణం ఎక్కడ?

సీత లేకుండా దేవలోకాధిపత్యం, భూలోకచక్రవర్తిత్వం నేను కోరను. నాకు ఇష్టం లేదు!

సీతకోసమై నేను మరణించిన పిదప నీవు అయోధ్య చేరిన ఎడల కైక ఆనందించును గదా!

నేను ఆశ్రమానికి వెళ్ళిన వెంటనే ఎదురొచ్చి సీత నవ్వుతూ నన్ను పలుకరించకుంటే నాకు మరణమే శరణ్యం.

ఆ రాక్షసుడు అలా గట్టిగా అరచినప్పుడు నీకు కూడా భయం కలిగి యుండును.

నిన్ను త్వరపెట్టి బహుశా సీతే నా వద్దకు పంపి ఉంటుంది!

నీ మీద విశ్వాసముంచికదా నేను వచ్చింది, ఏల నీవు సీతను వదలి వచ్చినావు.

నరమాంస భక్షకులైన రాక్షసులు నేను ఖరుడిని చంపుటవలన దుఃఖితులై మనమీద తీవ్రమైన క్రోధం పూని ఉన్నారు.

ఇలా విలపిస్తూ తమ ఆశ్రమ ప్రాంతానికి తిరిగి చేరారు అన్నదమ్ములిరువురూ.

దారిలో కనపడిన జంతువులను, చెట్టు పుట్టలను ప్రశ్నిస్తూ తమ నివాసానికి చేరుకున్న రామలక్ష్మణులకు శూన్యమై బోసిపోయిన పర్ణశాల అగుపించింది.

అన్నా నీ శక్తిసామర్థ్యాలెటువంటివో తెలిసిన నేను వదిన గారిని ధైర్యం కోల్పోవద్దు అని చెప్పాను.

జగదేకవీరుడైన రామునికి ఏ ఆపద వాటిల్లదు, నీవు నిర్భయంగా ఉండు తల్లీ అని చెప్పినప్పటికీ వినక నన్ను నానా దుర్భాషలాడింది.

నేను – భరతుడు కలసి కుట్రపన్నామనీ, వదినగారి మీద నాకు ఉండకూడని భావనలున్నాయనీ నన్ను ఆడిపోసుకొని అక్కడనుండి కదిలేవరకు ఒకటే పోరుపెట్టగా, ఆమె మాటలు వినలేక, నీ ఆజ్ఞ ధిక్కరించలేక సతమతమైపోయిన నన్ను మరల మరల అవే పలుకులు ములుకులలాగా బాధించి అక్కడనుండి కదిలేట్లు చేశాయి. తప్పనిసరి పరిస్థితిలో నీ కోసం వచ్చాను.

లక్ష్మణా నీకు తెలియదా! రాక్షసులను మర్దించగల నా సామర్థ్యం!

తప్పు చేసినావయ్యా నీవు, తప్పుచేసినావు!.

తడబడుతున్న పాదాలు, వణుకుపుడుతున్న హృదయంతో సీతాదేవి క్షేమం గురించి తలుస్తూ పర్ణశాల ప్రాంతమంతా కలియతిరిగినాడు, ఎక్కడా కనపడలేదు తన ప్రియసతి సీత!.

ఆశ్రమంలో పక్షులు, ప్రాణులు దీనంగా రామునివైపే చూస్తున్నాయి. పూవులు వాడిపోయాయి, వనదేవతలందరూ ఆ వనాన్ని విడిచిపోయారు. శోభా విహీనంగా ఉంది ఆ ప్రాంతమంతా!

పర్ణశాలలో వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి వున్నాయి.

సీత ఏమై ఉంటుంది?

ఎవరో హరించియుండవచ్చును. లేక మరణించి యుండ వచ్చును. లేక తప్పిపోయి ఉండును.

ఎవరో భక్షించి యుండవచ్చును.

లేదా వనంలోనికి వెళ్ళియుండెనా?

లేక ఎచటనైనా దాగియుందా?.

లేక నీటి కొరకై నదికి వెళ్ళియుండెనా?

పూవులకొరకు పద్మసరస్సుకు వెళ్ళి యుండెనా ?

మొత్తం వనమంతా గాలించినా ప్రియసతి జాడ తెలియ రాలేదు. దుఃఖంతో కన్నులు ఎర్రబారి పిచ్చివానివలె శోకించ సాగాడు రాముడు.

ఒక చెట్టునుండి మరియొక చెట్టుకు, ఒక గుట్టనుండి మరియొక గుట్టకు, ఒక గట్టు నుండి మరియొక గట్టుకు.

పిచ్చివాని వలె పరుగులుపెడుతూ శోక సంద్రంలో మునిగితేలుతూ.

కనపడిన చెట్టును, పుట్టనూ అడుగుతున్నాడు సీతావియోగ బాధాపీడితుడై పిచ్చివాడైన రామచంద్రమూర్తి.

ఓ కదంబమా! నీ పువ్వులు అనిన నా సీతకు ప్రాణం, నీకు ఆవిడ కనపడ్డదా?.

ఓ బిల్వమా! నా మైథిలి నీకు అగుపడినదా?

ఓ అర్జున వృక్షమా నా జానకి నీకు ఎక్కడైనా కనపడ్డదా?

ఓ తిలక వృక్షమా నారీ తిలకమైన విదేహరాజపుత్రిని చూచినావా ఎక్కడైనా?

ఓ అశోకమా నీవైనా నా ప్రియసతి జాడ తెలిపి నా శోకం బాపుమా!

ఓ జంబూ వృక్షమా, ఓ కర్ణికారమా! ఓ చూతమా, ఓ పున్నాగమా! ఓ దాడిమ వృక్షమా ఏది నా సీత? ఎక్కడ నా హృదయేశ్వరి?

చెట్లు పుట్టలు పొదరిళ్ళ వద్దకు వెళ్ళి పిచ్చివాని వలే ప్రశ్నిస్తూ.. సీత అల్లంత దూరంలో ఉన్నట్లుగా భ్రమిస్తూ వనమంతా గాలిస్తున్నాడు రామభద్రుడు.

సీతా.. సీతా.. సీతా.. ఎక్కడున్నావు నీవు నన్ను పరిహ సించటానికై ఎక్కడన్నా దాక్కున్నావా?

ఇంక పరిహాసాలు వద్దు!

రా! నీవులేక నా బ్రతుకు శూన్యం!

లక్ష్మణా! ఇక నేను జీవించలేను, మన తండ్రి దశరథ మహారాజును స్వర్గలోకంలో కలుసుకొందును. అయ్యో! అందుకు కూడా నాకు అనుజ్ఞలేదయ్యా! వనవాసకాలం పూర్తిచేయకముందే ఎందుకు నా వద్దకు వచ్చావు? నా ఆజ్ఞను ధిక్కరించుటయే కదా ఇది! అని మనతండ్రి నన్ను కోపగించుకొనవచ్చును.

సీత కానరాక పసిపిల్లవానిలాగ విలపించుచున్న పురు షోత్తముని చూసి లక్ష్మణుడు! అన్నా! శోకింపకు.. ప్రయత్నం చేయుదము! ఈ వనంలో ఎన్నో గుహలున్నవి కదా! వాటినన్నిటినీ వెదుకుదాం అని పలికాడు.

వదిన గారు స్నానం కొరకో, పూల కొరకో, నీటి కొరకో, లేక మనలను ఆటపట్టించుటకొరకో ఎచటికైనా వెళ్ళి యుండ వచ్చును కదా! ముందు ఆమెను వెదికే ప్రయత్నం చేద్దాం.

ఆ విధంగా ఆ వనమంతా అణువణువు గాలించారు అన్నదమ్ములిరువురూ. కానీ, కానరాలేదు సీతమ్మ.

మరల రాముని దుఃఖం అధికమైంది. వేడివేడి నిట్టూరుపులు విడుస్తూ స్పృహ తప్పుతూ బుద్ధికోల్పోయి పిచ్చివాడిలాగ అటు ఇటు తిరుగుతున్న ఆయనను పట్టుకొని ధైర్యం చెపుతూ లక్ష్మణుడు ఓదారుస్తున్నాడు.

మాటిమాటికి స్పృహ కోల్పోతూ లేస్తూ అయ్యో ప్రియురాలా అంటూ నేలపై చతికిలపడుతూ పొర్లుతూ దీనుడై ఉన్న రాముని చూసి లక్ష్మణుడు తాను కూడ ధైర్యంకోల్పోయినవాడై మరల తేరుకొని అన్నను జాగ్రత్తగా పట్టుకొని సాంత్వన వచనాలు పలుకసాగాడు.

లక్ష్మణా! ఒక్కసారి గోదావరి వద్దకు వెళ్ళి చూసిరా! తామర పూవులు కోసుకొని వచ్చుటకు వెళ్ళినదేమో అని పంపాడు రాముడు.

లక్ష్మణుడు తిరిగి వచ్చి కనపడలేదు అని చెప్పగా ఆ పర్వత గుహ వద్ద ఉన్నదేమో చూసిరా అని మరల పంపాడు, ఈ విధంగా లక్ష్మణుడు వెదుకని చోటులేదు, తిరుగని ప్రదేశంలేదు, ఎక్కడా సీతాదేవి జాడ కానరాలేదు.

లక్ష్మణుని మాటలు నమ్మక మరల స్వయంగా తానే సీతా సీతా అని కేకలు వేస్తూ అన్ని ప్రదేశాలు తిరిగి తిరిగి హృదయ వేదన భరించరానిదై, శోకం బరువై కూలబడ్డాడు రామచంద్రుడు.

సీత ఎక్కడ ఉంది? సకల భూతములను, నదులను, పర్వతా లనూ ప్రశ్నిస్తూ పిచ్చివాడివలే తిరుగుతున్నాడు రాఘవుడు.

సీత ఎక్కడ ఉంది అన్న ప్రశ్న వినగానే మృగాలన్నీ ముట్టెలెత్తి దక్షిణదిక్కును సూచిస్తూ, ఆకాశం వైపు తలెత్తి చూపించి అటుగా పరుగులెత్తాయి.

ఆ మృగహృదయాలను అర్థం చేసుకొన్న లక్ష్మణుడు అన్నా! మృగాలన్నీ కూడా దక్షిణదిక్కును సూచిస్తున్నాయి కావున అటువైపు వెళ్ళి వెదుకుదాం పద అని అటువైపుగా నడక సాగించారు.

ఇరువురూ నేలను పరిశీలనగా చూస్తూ నడుస్తున్నారు. దారిలో రాలినపూవులు కనపడ్డాయి. అవి ఆరోజు సీతాదేవి కొప్పున ముడిచిన పూలే అని రాముడు గుర్తుపట్టాడు.

ఓ పర్వతమా నా సీత జాడ చెప్పు, లేనిచో ఇదిగో ఈ శరాలు నిన్ను చూర్ణం గావిస్తాయి!

.. (సశేషం)

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



## కడప మహానాడులో గూడూరు నేతలు

కడపలో నిర్వహించిన తెలుగుదేశం మహానాడుకు గూడూరు నుంచి ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్‌తో పాటు పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. వాకాడు, కోట, చిట్టమూరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు వివిధ వాహనాలలో కడప మహానాడుకు చేరుకున్నారు. అలాగే సూళ్లూరుపేట శాసనసభ్యురాలు విజయశ్రీ, సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు తోట రమేష్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కడప మహానాడులో పాల్గొన్నారు.



## శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం

## వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 5 నుండి

**ఛైర్మెన్ శ్రీకంటి రామమోహన్‌రావు**



గూడూరు, రాజావీధిలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 5వ తేదీ నుండి 15వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఛైర్మెన్ శ్రీకంటి రామమోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

## తాగునీటి సమస్యను తీర్చండి



తిరుపతి జిల్లా వాకాడు మండల పరిధిలోని నిడుగుర్తి పంచాయతీలోని వల్లమేడు, రెడ్డి పాలెం, శ్రీపురం, బాలాజీనగర్ గ్రామాల ప్రజలు తాగునీటి సమస్యపై మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఇటీవల ఆందోళన చేపట్టారు. ఈ నిరసనపై సంబంధిత అధికారి స్పందిస్తూ ఆయా గ్రామాలకు వెళ్లి అక్కడ పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపుతామని తెలియజేశారు.

## విందూరు రహదారి బాగుచేయండి

**- పంటా శ్రీనివాసులురెడ్డి**



గూడూరు నుంచి మిటాత్మకూరు మార్గం వరకు వెళ్ళే గూడూరు - విందూరు ప్రధాన రహదారి గుంతల మయంగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంచా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన ఈమేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నుంచి మిటాత్మకూరు వరకు రెండు వరుసల రహదారి మంజూరైనా అధికారులు నిర్లక్ష్యంతో రోడ్డు బాగు చేయలేదని చెప్పారు.


## ఆటిజం సెంటర్ ఏర్పాటుకు పరిశీలన

గూడూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆటిజం సెంటర్ ఏర్పాటు కోసం తిరుపతి అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో బాలికల పాఠశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం మాధవిలక్ష్మి, జె.ఆర్.పి.లు హేమలత, అజయ్‌బాబు, మంగమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## చక్కని అభివ్యక్తితో సాగిన.. అన్నం శివకృష్ణ 'దుఃఖపు తర్జుమా'

నెల్లూరులో మరో కొత్త యువకవి ఆవిర్భవించారు. దుఃఖాన్ని తర్జుమా చేస్తూ ప్రతి కావ్యాన్ని రసాత్మకంగావిస్తూ, వినూత్న అభివ్యక్తితో విస్తుపోయేలా సాగిన కవితా నిర్మాణ ప్రక్రియను వెలికితెచ్చిన అద్భుత సంఘటనే అన్నం శివకృష్ణ ప్రసాద్ కవిత్వం 'దుఃఖపు తర్జుమా'. వస్తువు తేలికపాటిదైనా తనదైన శైలిలో పాఠకుణ్ణి రంజింపచేయగల్గిన దిట్ట శివకృష్ణ.

శివకృష్ణది తనదైన ప్రతిభావంత కవిత్వం. ప్రతి వాక్యాన్ని మనసారా వీక్షించి, అక్షరాలను పొదుగుకొని, వాక్యాలు నిర్మించుకొని పద చిత్రాలను పోగేసి తొలి అడుగే బలంగా సాగిన కవిత్వం ఆయనది. కవిత్వమంటే అపారమైన ప్రేమతో అనుభవించి అమర్చిన కొరడా ఝుళిపింపు 'దుఃఖపు తర్జుమా'.




రచయిత: **అన్నం శివకృష్ణ ప్రసాద్**
వెల: రూ. 150/- పేజీలు: 140
ప్రతులకు: అన్నం శివకృష్ణ
సౌత్‌మోపూరు, నెల్లూరు రూరల్
ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా - 524 004.
సెల్: 9490325112

నెల్లూరులో జరిగే రొట్టెల పండుగపై శివకృష్ణ రాసిన కవిత చాలా ఆర్ద్రంగా సాగుతుంది. బహుశా ఈ అంశం మీద ఎవరూ ఇంత గొప్పగా కవితలు చెప్పిన వాళ్ళు లేకపోవడం శివకృష్ణ ప్రత్యేకత. 'వీరుల రక్తంతో తడిచిన మట్టిని కాస్త విభూదిగా రాసుకెళ్ళండి. సర్వమత సమైక్యతా రాగం వినబడుతుంది.' అని చెప్పు 'సామరస్య ఆహ్వాన పత్రిక' కవితలో 'వారి సమాధులపై రాసిన గంధాన్ని పట్టుకెళ్ళి ముక్కలు ముక్కలుగా గాయపడ్డ ఏ యుద్ధ సరిహద్దురేఖ పైనో చల్లండి' శాంతి కపోతాలెగురుతాయి అంటారు శివ. సర్వమతాల్ని సమదృష్టితో చూడాలన్న తపన, యుద్ధ భూమి కాదు, బుద్ధ భూమి కావాలన్న ఆశయం కవిలో పుష్కలంగా నెలకొని గొప్పగా తాపత్రయ పడిన విశిష్టతే ఈ కవిత్వం.

వర్తమాన కాలంలో ప్రజలు కార్పొరేట్ వ్యాపార సంస్థలకు దాసోహమంటున్నారు. వారి ప్యాకింగ్ విధానాలకు వలలో పడి, ఆ మోజులో యాంత్రికంగా కాలం వెళ్ళబుచ్చుతున్నారు. శీతల వాయు సమీరాలకు మనసు పారేసుకుంటున్నారు. శివకృష్ణ కవిత 'దేహదేవాలయం'లో ఆ విషయాన్ని ప్రకటిస్తూ మనం ఎలా ఓడిపోతున్నదీ వివరిస్తారు. 'డీమార్టు వెజిటబుల్ ప్యాకింగ్ నిపుణతకు పర్సుని తాకట్టు పెడుతూ..! కుర్లాన్ పరుపు మెత్తదనానికి ఒంటిని దాసోహం చేస్తాం. ప్రతిరోజూ కార్పొరేట్ హంగుకి చిక్కి మోసపోయి ఓడిపోతుంటాం.' అని గొప్ప చాతుర్యంతో ప్రకటిస్తాడీ కవి.

మేరు నగధీరుడు కవిత కల్నల్ సంతోష్‌బాబు స్మృతిలో రాసిన కవిత గొప్పగా పేలిందంటే అతిశయోక్తి కాదు. 'అమె నేర్పించొక్కటే, జవాను కవాతు చప్పుళ్ళను హృదయంలో ముద్రించుకొని దేశ సరిహద్దు గీతపై అమ్ములా మరణించి దేశాన్ని గెలిపించడమేనంటూ సంతోష్‌బాబు అమ్మ తనయుని దేశానికి అర్పించిన తీరును కవిత్వీకరించారు శివకృష్ణ. ప్రతి పాదమూ ఒక స్పర్శతో తడిపి ముద్రించిన శివకృష్ణ అభినందనీయుడు.

'మట్టి బొమ్మలు' మరో మంచి కవిత. మతాలెందుకు, కులాలెందుకు సర్వమత సమానత్వం తన భావనగా చెప్తూ 'మట్టిలో పుట్టి మట్టిలో కలిసిపోయే బొమ్మల్ని చేసింది దేవుడే కావచ్చు. ఈ బొమ్మల మధ్య బేధాలు సృష్టించిన నేరం మాత్రం దేవుడిది కాదు.. మనిషిదే'నన్న పెద్ద విమర్శ సహేతుకంగా ఉంది.

'మట్టికుండ'లో ఓ వ్యక్తిని గురించి చెప్తూ 'వాడు నా కొడుకే చిత్రంగా స్వేద పరిమళాన్నే ఇష్టపడతాడు, మనిషితనాన్నెతుకుతున్నాడు, ప్రపంచీకరణకు ప్రతినిధి చేద్దామంటే వాడు శ్రామిక సారెలో మట్టి కుండవుతున్నాడు' అంటూ శ్రామిక వర్గంపై తన మమకారాన్ని తెలియజేస్తాడు. స్వేదాన్ని చిందించే వ్యక్తుల్ని దగ్గరగా ప్రేమించే హృదయోన్నతిని వ్యక్తపరుస్తారు. 'వెలుగు చూడని మూలకణం' ఆశావహ దృక్పథంతో రాసిన గొప్ప కవిత. 'నాయన్ని సారా సీసా మింగేసిందని, తాతని కలరా మహమ్మారి పొట్టన పెట్టుకుందని వాడేమీ దిగులు రంగు పులుముకోలేదు. చిటికెన వేలంతవాడు గుత్తేదారుని నిర్మాణ హర్మ్యానికి రక్షణ దుర్గమయినాడు' అని నిరాశ చెందని దార్శనికుడి గురించి చెప్పిన తీరు, బోధించిన విధానం చక్కగా సాగింది. భవన నిర్మాణ కార్మికుని వెలుగుచూడని కలల్ని 'మూలకణం' కవితలో చెప్తూ 'గోడలు ఎదుగుతుంటే తాను ఎదుగుతున్నట్లేనని సంబరపడ్డాడని, రంగులు వేస్తుంటే హోళీ ఆడాడని, గృహప్రవేశం రోజున ఎంగిలిపడ్డాడో లేదో'నని అబ్బురం ప్రకటిస్తాడు. బాధాతప్త హృదయంతో అత్తిపత్తి ఆకులా కవి ఘూర్ణిల్లుతాడు.

ప్రతి సమయాన్ని, ప్రతి విషయాన్ని కవిత్వం చేయగల నైపుణ్యం తొలి పుస్తకానికే సాధించిన ప్రతిభాశాలి శివకృష్ణ అభినందనీయుడు.



సమీక్షకులు:
**చిన్ని నారాయణరావు**
9440202942

## శ్రీ చాముండేశ్వరి బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు



ఇందుకూరుపేట మండలంలోని సముద్రతీర గ్రామం గంగపట్నంలో వెలసి వున్న మహిమాన్విత దేవత శ్రీ చాముండేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలను జూన్ 2 నుంచి నిర్వహించేందుకు ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల తహశీల్దార్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామపెద్దలు, ఆలయ అధికారులు సమావేశమై బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల విషయమై చర్చలు జరిపారు. ఆలయ ఇఓ తాతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జయభారత్ ఆధ్వర్యంలో..

## ఉచిత నేత్రవైద్య శిబిరం




కొడవలూరు మండలం, యల్లాయపాళెం గ్రామంలోని విజయ పాలడెయిరీ కేంద్రం ఆవరణలో ఇటీవల నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రి వైద్యబృందం వారు ఉచిత కంటివైద్యపరీక్షల శిబిరం నిర్వహించి గ్రామస్తుల కంటిసమస్యలను పరిశీలించారు. అనంతరం వారికి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక ప్రముఖులు పివి రాంరెడ్డి, వై.వంశీ, సుధాకర్‌రెడ్డి, చిన్నబ్బయ్య, రియాజ్‌బాషా, రాఘవేంద్ర, సురేష్‌రెడ్డి, రమేష్, శేఖర్ తదితరులు తమ సహకారం అందించారు.

## 'మై భారత్'లో...

## పేర్లు నమోదు చేసుకోండి

యువత 'మై భారత్' పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకుని, వారి ఆలోచనలు, అభిప్రాయాలు, సూచనలను తమకు తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర యువజన వ్యవహారాల శాఖ కోరుతోంది. ఆమేరకు సెట్నెల్ సీఈఓ ఏ.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో మై భారత్ పోర్టల్ ప్రాధాన్యతను వివరించారు. యువతకు సాధికారత కల్పించడం, వారి అభివృద్ధి, దేశ నిర్మాణానికి తోడ్పడడానికి పలు అవకాశాలు, వనరులు పొందేలా చేయడం దీని ఉద్దేశ్యమన్నారు. జిల్లాలోని యువకులు 15 నుంచి 29 సంవత్సరాల లోపు వయసు కలవారు తమ పేర్లను https://mybharath.gov.in పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. వారి అభిప్రాయాలు, వ్యక్తిగతంగా లేదా సమిష్టిగా వారు చేస్తున్న సమాజ కార్యకలాపాలను కూడా ఎప్పటికప్పుడు ఆ పోర్టల్‌లో పంచుకోవాలని కూడా ఆయన వివరించారు.

# కళ్యాణ వైభవం...!




నెల్లూరు నగరంలో ప్రఖ్యాత నిర్మాణసంస్థ పూజిత కన్స్ట్రక్షన్స్ అధినేత తురిమెర్ల నరేంద్రరెడ్డి - శ్రీమతి శిరీషల కుమార్తె **పూజిత - సాయిప్రణీల్** (ప్రముఖ వ్యాపారవేత్త పిడూరు కిషోర్‌రెడ్డి - శ్రీమతి శరణ్యల కుమారుడు)ల వివాహం మే 21న నెల్లూరులో వైభవంగా జరిగింది. కొత్త దంపతులకి 'లాయర్' శుభాశీస్సులు.

# కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం

(మొదటిపేజీ తరువాయి)

జతకట్టి అంతకు మించిన సంక్షేమం అందిస్తామంటూ సూపర్ సిక్స్ పథకాలను తెరపైకి తెచ్చాయి. వీటిని నమ్మిన ప్రజలు 2024 ఎన్నికల్లో కూటమిని బంపర్ మెజారిటీతో గెలిపించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ అమల్లో కూటమి సన్నాయి నొక్కులు, ప్రజల్లో అనుమానాలకు తావిచ్చేలా ఉన్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

## ఆరింటిలో ఇప్పటికి రెండే..

సూపర్ సిక్స్ పథకాల్లో వృద్ధాప్య పింఛన్ రూ. 4 వేలకు పెంచడం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి కార్యక్రమాలను చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోంది. 64లక్షల మంది లబ్ధిదారులు సామాజిక పింఛన్లు పొందుతున్నారు. ఇక దాదాపు కోటి మంది ఉచిత సిలిండర్లు అందుకుంటున్నారని కూటమి నేతలు చెప్తున్నారు. అయితే సూపర్ సిక్స్‌లో అత్యంత ముఖ్యమైన అంశం తల్లికి వందనం. ఈ పథకం ద్వారా పిల్లలను బడికి పంపించే తల్లి ఖాతాలో ఎంతమంది బిడ్డలుంటే అంతమందికీ ఒకొక్కరికీ ఏడాదికి రూ. 15 వేలు చొప్పున అందిస్తామని మేనిఫెస్టోలో చంద్రబాబు ప్రకటించారు. దీనిని అమలు చేయడం కత్తిమీద సామే అన్నది విశ్లేషకుల అభిప్రాయం. గతంలో 42లక్షల మంది తల్లుల ఖాతాలో వైఎస్. జగన్ ప్రభుత్వం సంవత్సరానికి రూ. 15 వేలు చొప్పున వేసింది. అయితే, ప్రస్తుతం ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ రూ. 15 వేలు చొప్పున వేయాల్సి ఉంది. దీంతో లబ్ధిదారుల సంఖ్య 73లక్షల మందికి చేరుతుందని భావిస్తున్నారు. కాగా ఈ పథకాన్ని మేలో అమలు చేస్తామని చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. కానీ, అమలు చేయలేదు. త్వరలో వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో 'తల్లికి వందనం' పథకం ప్రతిపక్షానికి ప్రధాన అస్త్రంగా మారే అవకాశం కనిపిస్తోంది. అలాగే, 'అన్నదాత సుఖీభవ' కింద రాష్ట్రంలోని రైతులందరికీ ఏడాదికి రూ. 20 వేలు చొప్పున బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ఇదికూడా కూటమికి గుదిబండలా మారే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే ఏపీలో నైరుతి రుతుపవనాల సీజన్ ప్రారంభం కావడం, ఎప్పుడూ లేని విధంగా 16 ఏళ్ల తర్వాత కేరళలో తొలిసారి మేనెల చివరి వారంలోనే తొలకరి పలకరించడం చూశాం. దీంతో ఏడాది ఖరీఫ్ సాగుపై రైతులు బోలెడు ఆశలు పెట్టుకున్నారు. ఇలాంటి సమయంలో అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించకుంటే కూటమి ప్రభుత్వంపై అన్నదాతల్లో కూడా అసంతృప్తి పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఇక రాష్ట్రంలోని 1.54కోట్ల మంది రేషన్‌కార్డులున్న మహిళల ఖాతాల్లో 'ఆడబిడ్డ నిధి' పథకంలో భాగంగా ప్రతినెలా రూ. 1,500 జమచేయాల్సి ఉంది. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడంతో పాటు 40 లక్షల మంది నిరుద్యోగులకు ప్రతినెలా రూ. 3వేలు నిరుద్యోగ భృతి కూడా అందించాల్సి ఉంది. తొలి సంతకం అన్న ఉపాధ్యాయ నియామక పరీక్ష డీఎస్సీకి మార్గం సుగమం అయినా అది ఓ వర్గానికి మాత్రమే ఉపశమనం కలిగించనుంది. ఇక ఆగస్టు 15న బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మొదలవుతుందని ప్రకటించడం పట్ల మహిళా లోకంలో ఆనందాలు వెల్లువెత్తుతున్నాయి.

## రెండు కళ్ళపై ప్రధాన దృష్టి..

పోలవరం, అమరావతి రాష్ట్ర అభివృద్ధికి రెండు కళ్ళు అని చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. ఇందు కోసం తొలి ఏడాది పాలనలో పోలవరం పనులు కొంతమేరకు వేగవంతం చేశారు. అయితే వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇవి నెమ్మదించే అవకాశం కనిపిస్తోంది. ఇక కేంద్రప్రభుత్వం రూ. 15 వేల కోట్లను అమరావతికి అప్పు ఇప్పించేలా ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించింది. ఈ నిధులు దశల వారీగా విడుదలైతే అమరావతి మరింత వేగం పుంజుకునే అవకాశం లేకపోలేదు. పైగా ప్రధాని మోదీ స్వయంగా పనులను పునఃప్రారంభించిన నేపథ్యంలో చంద్రబాబు ఫోకస్ మొత్తం అమరావతిపైనే నిలిపే అవకాశం ఉందనే వ్యాఖ్యానాలు కూడా వినిపిస్తున్నాయి. ఇక ప్రధానమైన సూపర్ సిక్స్ పథకాలను అటుంచితే డ్వాక్రా మహిళలకు రూ. 3 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, ఉద్యోగాలు చేసే మహిళలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో హాస్టల్ వసతి, పీ4 మోడల్, కళలకు రెక్కలు పథకం ద్వారా విద్యార్థులకు రుణాలు, పండుగ కానుకలు, పెళ్లికానుకలు వంటి హామీల అమలు ఏమౌతాయనే అంశం చర్చనీయాంశంగా మారింది.

## అసంతృప్తి.. ఆగ్రహంగా మారకూడదంటే!

రాష్ట్ర జీడీపీని పెంచుతున్నామని, తలసరి ఆదాయం వృద్ధికి మార్గాలు రచిస్తున్నామని, అమరావతి, పోలవరం, రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని పాలకులు ఎంత చెప్పుకున్నా చివరాకరికి మాకేంటి అనే ఆలోచనే ప్రజల్లో పాతుకుపోయిందన్నది నిర్వివాదాంశం. ఈ విషయాన్ని గుర్తెరిగి ఆరు నూరైనా, నూరు నూటపదహారు అయినా సంక్షేమ పథకాలపై చంద్రబాబు ప్రభుత్వం మరింతగా దృష్టి సారించాల్సిందే. లేకుంటే ప్రభుత్వంపై ప్రజల్లో ఇప్పటి వరకు నిగూఢంగా దాగున్న అసంతృప్తి మెల్లగా ఆగ్రహంగా మారే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటివరకు జరిగిన ఏడాది పాలనకు 50-50 మార్కులు పడినా కాలక్రమంలో అవి ముందుకో వెనక్కో మళ్లక తప్పదు. అవి ఏవైపుగా అడుగులు వేస్తాయో భవిష్యత్ పాలనే నిర్ణయించనుంది. దానికి డబుల్ ఇంజిన్ సర్కారు ఎలాంటి ప్రణాళికతో ముందుకెళ్తుందో వేచి చూడాలి. మొత్తం మీద ఈ ఏడాది పాలన కొంచెం ఇష్టం.. కొంచెం కష్టంగా సాగిందనడానికి మాత్రం సందేహం అక్కరలేదు..!

# తెలుగువారి కీర్తిబావుటా..ఎన్టీఆర్!

## ---- కొనియాడిన నేతలు, అధికారులు ----



ఎన్టీఆర్ అంటే..తెలుగువారి కీర్తిబావుటా అని, విఖ్యాత నటునిగా..మహా నాయకునిగా తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టిఆర్ స్థానం పదిలంగా నిలిచి ఉంటుందని, ఆయన చిరస్మరణీయులని వక్తలు కీర్తించారు. ఈనెల 28న ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని, నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో పాటు, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్టీసీ రీజనల్ ఛైర్మెన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి తదితరులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని దశదిశలా చాటిన మహానేత ఎన్టీఆర్ అని వారు కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం శ్రీ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసుకుంటే..తెలుగువారి ఆత్మగౌరవం కోసం కడదాకా కృషి చేసిన నేత ఎన్టీఆర్ అని అన్నారు. ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అందజేసిన ఎన్టీఆర్ సేవలు ఏనాటికీ విస్మరించలేనివన్నారు. ఎన్టిఆర్ జయంతిని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని, అందుకు సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే స్వర్ణాంధ్ర సాధ్యం!


## - మహానాడులో ప్రశాంతిరెడ్డి



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రం గత వైకాపా పాలన విధ్వంసం నుంచి వికాసం వైపు పయనిస్తోందని, చంద్రబాబుతోనే స్వర్ణాంధ్ర సాధ్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. కడపలో జరిగిన మహానాడు వేదికపై ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దార్శనికత అందరికీ మార్గదర్శకమన్నారు. తమకు రాజకీయాల్లో మంచి స్థానం కల్పించి గౌరవం ఇవ్వడం పట్ల ఈ సందర్భంగా చంద్రబాబుకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాజకీయపార్టీకి వారసుడు కావడం అనేది పెద్ద సాహసమని, అలాంటిది కార్యకర్తల మనసు గెలిచిన నాయకునిగా నారా లోకేష్ తనను తాను నిరూపించుకున్నారని ఆమె కొనియాడారు. విపత్కర పరిస్థితిలో తల్లిదండ్రులను పార్టీని కాపాడుకుంటూ, రాక్షసంగా పరిపాలించిన నియంతతో పోరాడినప్పుడే ఆయన శక్తి ఏంటో తెలిసిందన్నారు. ఉత్తమ నాయకత్వ లక్షణాలు, మనసున్న అధినేతలతో కలిసి పనిచేయడం తమకెంతో సంతోషం కలిగిస్తోందని అన్నారు. కష్టపడి పని చేయడం, నిజాయితీగా ఉండటం, నిత్యం ప్రజల భవిష్యత్తు కోసం తపించడం వల్లే ప్రజల గుండెల్లో చంద్రబాబుకు మంచిస్థానం వచ్చిందన్నారు. ఎన్నికల హామీల అమలుకి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ చంద్రబాబు ముందుకు సాగుతున్నారన్నారు.

# రానున్న నాలుగు సంవత్సరాలలో.. మరింత మండనున్న ఎండలు

## హెచ్చరిస్తున్న డబ్ల్యుఎంఓ తాజా నివేదిక



ఈ ఏడాది ఎండలు భగ్గుమంటున్నాయనుకుంటే, ఇప్పుడే కాదు రానున్న సంవత్సరాల్లో కూడా ఎండలు మరింత మండిపోతాయని తాజాగా నిపుణుల నివేదికలు హెచ్చరిస్తున్నాయి. 2025-29 మధ్య కాలంలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రత మరో 1.5 డిగ్రీల సెల్సియస్‌కి పెరిగే ప్రమాదం ఉందని, భూతాపం పెరుగుతుండడంతో ఆ సంవత్సరాల్లో ఏదో ఒక సంవత్సరం గత ఏడాది (2024) కంటే ఎక్కువగానే వేసవి గాడ్పులను ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రపంచ మెట్రొలాజికల్ సంస్థ (డబ్ల్యుఎంఓ) ఈనెల 29న విడుదల చేసిన నివేదికలో స్పష్టం చేసింది. దీంతో రాబోయే సంవత్సరాల్లో ప్రపంచ పర్యావరణ వ్యవస్థలు, ప్రజల దైనందిన జీవితాలు కష్టాల్లో పడతాయని తెలిపింది. పర్యావరణం పట్ల సరైన శ్రద్ధ తీసుకోకపోవడంతో భూమిపై ఉష్ణోగ్రతలు వేగంగా పెరిగిపోతున్నాయని, వాతావరణ మార్పులతో కొన్ని దేశాల్లో అధిక ఉష్ణోగ్రతలు, మరికొన్ని చోట్ల అత్యధిక వానలు కూడా కురుస్తాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఏదేమైనా, ఈ అసాధారణ పరిస్థితులను తట్టుకునేందుకు విస్తారంగా మొక్కలు నాటడం, చెట్లను నరికివేయకుండా కాపాడుకోవడం, వనాలు - అడవులను రక్షించుకుంటూ, పచ్చదనాన్ని పరిరక్షించుకోవడం తప్ప మరో మార్గాంతరం లేదని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.



# కామాక్షితాయి అమ్మవారి కల్యాణోత్సవం

## పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

బుచ్చిరెడ్డిపాలెం మండలం జొన్నవాడలో వెలసివున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ మల్లికార్జునస్వామి సమేత శ్రీ కామాక్షితాయి అమ్మవారి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కన్నులపండువగా సాగిన ఈ కల్యాణోత్సవానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. శివనామ స్మరణతో జొన్నవాడ మార్మోగిపోయింది. కల్యాణం సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్వామివారికి-అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఉత్సవ కమిటీతో కలిసి పట్టు వస్త్రాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆమెను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ ఆలయ సేవా కమిటీ ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ పెంచలయ్య, బుచ్చిరెడ్డి పాళెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

### బాలసాహితీ సమ్మేళనంలో..

# డా. గంగిశెట్టికి సన్మానం



తెలంగాణ సారస్వత పరిషత్ 82వ స్థాపన దినోత్సవం ఇటీవల హైదరాబాదులోని శాంతా-వసంతా ట్రస్ట్ సౌజన్యంతో ఘనంగా జరిగింది. డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శ్రీమతి కోదూరు శాంతమ్మ స్మారక బాలసాహిత్య సమ్మేళనంలో నెల్లూరుకు చెందిన బాలసాహితీవేత్త డా. గంగిశెట్టి శివకుమార్ పాల్గొని 'చిత్ర కథ' అనే అంశంపై ప్రసంగించి ప్రముఖుల అభినందనలు అందుకున్నారు. శాంతా-వసంతా ట్రస్టు వ్యవస్థాపకులు, మన నెల్లూరీయులు..పద్మభూషణ్ డా.కెఐ వరప్రసాదరెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డా.జె.చెన్నయ్య, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారులు డా.కెవి రమణాచారి, నేషనల్ బుక్‌ట్రస్ట్ ఆఫ్ ఇండియా దక్షిణ ప్రాంతీయ అధికారి డా. పత్తిపాక మోహన్ తదితరులు పాల్గొని డా.గంగిశెట్టిని ఘనంగా సన్మానించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 2 వందల మందికి పైగా బాలసాహితీ వేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

# ఆధార్..అవస్థలు తీర్చండి

ఆధార్ కార్డుల్లో అవసరమైన మార్పుచేర్పుల కోసం అనేక ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కేంద్రాలు అన్ని మండలాల్లో అందుబాటులో లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. ఇటీవల ఉదయగిరి మండలంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటుచేశారు. ఆ చుట్టుపక్కల ఇంకెక్కడా ఆధార్ కేంద్రం లేకపోవడంతో, పెద్దసంఖ్యలో ప్రజలు ఈ కేంద్రానికి రావడంతో పిల్లలు, పెద్దలు అందరూ గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఈ బాధలు చాలవన్నట్లు సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లోని సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోవడంతో, అక్కడి ప్రజలు కూడా ఉదయగిరికే రావాల్సివస్తోంది. ఉన్నతాధికారులు ఇకనైనా అన్ని సచివాలయాలు, మండల కేంద్రాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

# శ్రీసిటీ అభివృద్ధి అభినందనీయం!

## థాయ్‌లాండ్ కాన్సులర్ జనరల్ ప్రశంస




అనేక పరిశ్రమలతో అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన శ్రీసిటీ వేగవంతమైన అభివృద్ధి అభినందనీయమని చెన్నైలోని రాయల్ థాయ్ కాన్సుల్ జనరల్ రాచా అరిబార్గ్ కొనియాడారు. ఇటీవల ఆయన తన సతీమణి నరఫాన్ అరిబార్గ్, కాన్సుల్ పిన్‌పాంగ్ చౌవాచాటాతో కలసి శ్రీసిటీలో రెండు రోజుల పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా వారు శ్రీసిటీలోని పలు పరిశ్రమలను సందర్శించారు. శ్రీసిటీ ప్రపంచ పెట్టుబడులకు అనువైన అభివృద్ధి కేంద్రంగా ఉందని వారు అభివర్ణించారు. శ్రీసిటీలోని వ్యాపార అనుకూల వాతావరణం థాయ్ పారిశ్రామికవేత్తలను విశేషంగా ఆకర్షిస్తుందని అరిబార్గ్ అభిప్రాయపడ్డారు. భారతదేశంలో వ్యాపార అవకాశాలను అన్వేషిస్తున్న థాయ్ వ్యాపారవేత్తలకు తప్పకుండా శ్రీసిటీని సిఫార్సు చేస్తానని కూడా ఆయన చెప్పారు. తొలుత, ఆయనకు శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్) బోడ్గన్ జార్జ్ శ్రీసిటీలోని థాయిలాండ్ పరిశ్రమ 'రాక్‌వర్త్' స్థాపన, ప్రస్థానాన్ని కాన్సుల్ జనరల్ బృందం దృష్టికి తెచ్చారు. శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, అంతర్జాతీయ మౌళిక సదుపాయాలు, పారిశ్రామిక అనుకూల వాతావరణం మరియు వ్యాపార ప్రయోజనాలను వారికి వివరించారు. రాష్ట్ర పారిశ్రామిక విధానం, తద్వారా నిర్మితమవుతున్న బలమైన తయారీ, పర్యావరణ వ్యవస్థ గురించి కూడా చెప్పారు. భారత్-థాయ్‌లాండ్ వ్యాపార సంబంధాలను పెంపొందించడంలో థాయ్ కాన్సుల్ జనరల్ రాచా అరిబార్గ్ సందర్శన కీలక పాత్ర పోషిస్తుందని, దేశంలో మరిన్ని థాయ్ కంపెనీల రాకకు వారి పర్యటన దోహదపడుతుందని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు.

# పద్యకవితకు వన్నెతెచ్చిన ఎంఆర్ ప్రసాద్

## సంస్మరణసభలో వక్తలు



పద్య కవిగా, పద్యకళా పరిషత్ అధ్యక్షునిగా మెట్టు రామచంద్రప్రసాద్ (ఎంఆర్ ప్రసాద్) పద్య కవితకు వన్నె తెచ్చారని పలువురు వక్తలు కొనియాడారు. ఈనెల 24న దివంగత ఎంఆర్ ప్రసాద్ సంస్మరణ సభ కోవూరు సమీపంలోని ఇనమడుగు గ్రామంలో ఉన్న శ్రీ సత్యానందాశ్రమంలో ఘనంగా జరిగింది. ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరితీర్థ స్వామి మాట్లాడుతూ, మెట్టు రామచంద్రప్రసాద్ తొలినుంచి పద్యకవిగా పేరొందారని, అంతేకాక ఎన్నో దశాబ్దాలుగా శ్రీ సత్యానందాశ్రమానికి గౌరవ సలహాదారుగా ఉంటూ ఆశ్రమ అభివృద్ధికి పాటుపడ్డారని, వారి సేవలు అపూర్వమని కొనియాడారు. ఎంఆర్ ప్రసాద్ ఎంతో సౌమ్యులు, స్నేహపాత్రులని అంటూ, మంచి వ్యక్తిత్వం కల కవిగా ఆయన కవితాలోకంలో సుప్రసిద్ధులయ్యారని ఆశ్రమ కార్యదర్శి నాగేశ్వరరావు ప్రశంసించారు. ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ మాట్లాడుతూ, మెట్టు వారు కవిత్వంతో పాటు గొప్ప వ్యక్తిత్వాన్ని కూడా కలిగినవారని ప్రశంసించారు. ఈ సందర్భంగా తాను రచించిన శ్రద్ధాంజలి పద్యాలను, శతావధాని నరాల రామారెడ్డి రచించిన 'స్నేహనీరాజనం' పద్యాలను రాజశేఖర్ గానం చేశారు. ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ కమిటీ అధ్యక్షులు, ఎంఆర్ ప్రసాద్ ఆత్మీయమిత్రుడు నలుబోలు బలరామయ్యనాయుడు మాట్లాడుతూ, మెట్టు వారు ఉత్తమ గురువుగా, ఆధ్యాత్మికవేత్తగా, ఉత్తమకవిగానే కాక, వ్యాపారవేత్తగా కూడా ఎంతో కీర్తిని గడించారన్నారు. ఈ సభలో ఆశ్రమ ఉపాధ్యక్షులు చీమకుర్తి వేంకటేశ్వరరావు, శ్రీ రామతీర్థస్వామి(యలమందయ్య), మెట్టు రామచంద్రప్రసాద్ ధర్మపత్ని పరమేశ్వరమ్మ, వారి రెండవ కుమారుడు జయశంకర్, మూడవ కుమారుడు శ్రీధర్, కుమార్తె స్వరాజ్యలక్ష్మి, ముగ్గురు కోడళ్లు, మనుమరాలు, మనుమళ్లు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని, మెట్టు వారిని స్మరించుకున్నారు.

# నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

స్కిల్ ఇండియాలో భాగంగా స్వర్ణ టోల్ వే, పీపుల్ ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ప్రాజెక్టు హెడ్ సురేష్‌రెడ్డి ఈనెల 26న ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగి, 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చని, 30 రోజుల పాటు ఈ ఉచిత శిక్షణ, ఉచిత వసతి ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయ్యాక ఉపాధి అవకాశాలు కూడా కల్పించనున్నామని, వివరాలకు 99481 32173, లేదా 80089 48266 నంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

# టూకీగా...



## గంగపట్నంలో భూముల రీ-సర్వే పరిశీలన

ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నంలో భూముల రీ-సర్వేని ఆర్డీఓ అనూష ఈనెల 27న పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ రీ-సర్వే వల్ల రైతులకు ఎంతో ఉపయోగకరమని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో ఏవైనా పొరపాట్లు జరిగివుంటే సరిచేసుకోవాలన్నారు. తహశీల్దార్ కృష్ణప్రసాద్, సర్వేయర్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పాతదేవరాయపల్లిలో కిశోరవికాసంపై అవగాహన

అనంతసాగరం మండలంలోని పాతదేవరాయపల్లి గ్రామంలో ఈనెల 27న అంగన్‌వాడీ కార్యకర్తలకు కిశోర బాలికల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. కిశోరబాలికలు సైబర్ నేరాలు వగైరాలతో మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని ఆమె వివరించారు.

## కొడవలూరు గ్రంథాలయంలో ఆటల పోటీలు

కొడవలూరు గ్రంథాలయంలో ఈనెల 27న విద్యార్థులకు పలురకాల ఆటలు, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులిచ్చారు. అనంతరం, చిన్నారులకు పుస్తకాలు చదవడం పట్ల ఆసక్తిని కలిగించారు. లైబ్రేరియన్ కె.రాజేశ్వరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## బోగోలులో ప్రత్యేక ఆధార్ శిబిరాలు

బోగోలు మండలంలోని గిరిజనులు ఆధార్ నమోదు చేసుకోవడం కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 2 నుండి 8వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. గిరిజనులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఈనెల 27న ఒక ప్రకటనలో కోరారు.

## వాసిలి వద్ద కారు ఢీకొని..వ్యక్తి మృతి

సంగం మండలం చెన్నవరప్పాడుకు చెందిన గొల్లపల్లి శ్రీనివాసులును వాసిలి వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో, ఆ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మరణించాడు. ఆత్మకూరు ఎస్ఐ జిలానీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కావలి రూరల్‌లో రేషన్‌షాపుల తనిఖీ

కావలి రూరల్ మండలంలోని పలు రేషన్‌షాపులను ఇటీవల తహశీల్దార్ శ్రావణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఆముదాలదిన్నె, రామచంద్రాపురం, తాళ్ళపాళెం, జువ్విగుంటపాళెంలలో ఉన్న రేషన్‌షాపుల్లో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. సక్రమంగా ప్రజలకు రేషన్ సరుకులను పంపిణీ చేసేందుకు డీలర్లకు ఆయన పలు సూచనలిచ్చారు.

## కంపసముద్రంలో 'భగవద్గీత' పుస్తకాలు పంపిణీ

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, టీడీపీ రాష్ట్ర నాయకుడు పుట్టం బ్రహ్మానందరెడ్డిల సూచనల మేరకు మర్రిపాడు మండలం కంపసముద్రం గ్రామంలో ఇటీవల జనసేన నాయకుడు గుర్రాల నరేంద్ర రాయల్ ఆధ్వర్యంలో భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. అందరూ ధర్మబద్ధంగా జీవించాలని చెప్తూ, సనాతన ధర్మం ప్రాశస్త్యాన్ని ఆయన గ్రామస్తులకు వివరించారు.

## చేజర్లలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ

చేజర్ల మండల పరిషత్ కార్యాలయంలోని ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఇటీవల బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిర్మలాదేవి పరిశీలించారు. మహిళల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె చెప్పారు. ఎండిఓ విజయలలిత, వెలుగు ఏపీఎం సుజీవని, ఇఓ పిఆర్డీ రామయ్య పాల్గొన్నారు.

## మోర్లవారిపాళెంలో కోడిపందెంరాయుళ్ళ అరెస్ట్

కావలి రూరల్ మండలం మోర్లవారిపాళెంలో ఇటీవల కోడిపందాల స్థావరాలపై పోలీసులు దాడులు చేసి, ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1580 రూపాయలను, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు రూరల్ ఎస్ఐ బాలకృష్ణ, పోలీసు సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు.



క్రమశిక్షణకు మారుపేరుగా ఉండాల్సిన గురువులే నిర్లక్ష్యానికి ప్రతిరూపాలుగా తయారైతే ఏమనుకోవాలి?..అసలు ప్రతి ఏటా పిల్లలకు పరీక్షలు..వాళ్ళ జీవితాలకే పరీక్షలుగా మారుతున్న నేపథ్యంలో, ఎంతో జాగ్రత్తగా జవాబు పత్రాలు దిద్దాల్సిన ఉపాధ్యాయులు అలక్ష్యంగా ఉంటూ, తమ ఇష్టం వచ్చినట్లు మార్కులు వేయడం ఎంత ఘోరం. రాష్ట్రంలో పలుచోట్ల ఈ ఏడాది పదవ తరగతి మూల్యాంకనంలో ఉపాధ్యాయుల తప్పిదాలెన్నో బట్టబయలు కావడంతో విద్యాశాఖ వర్గాలు విస్తుపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈసారి రీ వ్యాల్యుయేషన్, మార్కుల రీ కౌంటింగ్ కోసం *66,363* దరఖాస్తులు రావడం, వాటిని సరిచూడగా దాదాపు *11*వేల జవాబుపత్రాల్లో మార్కుల ఫలితాలు తారుమారు జరగడం చూస్తే... మూల్యాంకనం పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో ఊహించుకోవచ్చు.

# నిర్లక్ష్యపు అయ్యోర్లు...
# లబోదిబోమంటున్న విద్యార్థులు!

## • రాష్ట్రవ్యాప్తంగా 11వేల జవాబు పత్రాల్లో మార్కుల తారుమారు

గతంలో ఎప్పుడూ లేనిది..రాష్ట్రంలో ఇటీవల అనేకచోట్ల టెన్త్ పేపర్లను దిద్దడంలో అయ్యవార్ల తప్పిదాలు భారీ స్థాయిలో బయటపడ్డాయి. బాపట్ల జిల్లా కొల్లూరు జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థిని తేజస్వినికి మొన్నటి టెన్త్ ఫలితాల్లో 5 సబ్జెక్టుల్లో 90 మార్కులకు పైగా వచ్చాయి. సాంఘికశాస్త్రంలో మాత్రం ఫెయిల్ అయింది. దీంతో షాక్‌కు గురైన ఆ విద్యార్థిని రీవాల్యుయేషన్ చేయించగా, 96 మార్కులు రావడం, మొత్తంగా ఆ విద్యార్థిని 575 మార్కులు సాధించడం జరిగింది. ఇలా పలుజిల్లాల్లో మూల్యాంకనంలో అయ్యోర్లు తమ ఇష్టం వచ్చినట్లు మార్కులు వేయడంతో విద్యార్థులు లబోదిబోమంటున్నారు.

### ఎంతో కష్టపడి చదువుకున్నా...

అసలే, 10వ తరగతి విద్యార్థులు ఎంతో సున్నిత మనసుతో ఉంటారు. మంచి మార్కులు తెచ్చుకోవాలని తినీ తినకుండా రేయింబవళ్లు చదువుకునే విద్యార్థులు కొల్లలుగానే ఉన్నారు. అలా బాగా చదువుకునేవారు ఒక్కమార్కు తగ్గినా రాత్రీపగలూ ఏడుస్తూ కూర్చుంటారు. పొరపాటున మార్కులు తగ్గి, ఫెయిలయితే వారి జీవితాలు అల్లకల్లోలమవుతాయి. కనుక, ఉపాధ్యాయులు ఎంతో శ్రద్ధతో మూల్యాంకనం చేయాల్సివుంది.


### నెల్లూరు జిల్లాలో.. ఇద్దరు ఉపాధ్యాయులపై వేటు!

పదవ తరగతి మూల్యాంకనం (వాల్యుయేషన్)లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నెల్లూరుజిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులను గుర్తించి, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.బాలజీరావు వారిని సస్పెండ్ చేస్తూ ఈనెల 28న ఉత్తర్వులు జారీ చేశారు. జి.మోక్షిత అనే విద్యార్థినికి సాంఘికశాస్త్రంలో 84 మార్కులు రావాల్సి ఉండగా, 21 మార్కులు వేసి సరిపెట్టారు. అందుకు మనుబోలు జడ్పీ పాఠశాల ఉపాధ్యాయురాలు, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఏ.శాంతి, స్పెషల్ అసిస్టెంట్..కోవూరు మండలంలోని కొత్తూరు ఉపాధ్యాయుడు వి.సురేష్‌లను బాధ్యులుగా గుర్తించి వారిరువురిని సస్పెండ్ చేశారు.

### నష్టపోతున్న విద్యార్థులు

మూల్యాంకనంలో జరుగుతున్న తప్పిదాల వల్ల ఎంతోమంది విద్యార్థులు నష్టపోతున్నారు. రాష్ట్రప్రభుత్వం, ప్రత్యేకించి విద్యాశాఖ ఉన్నతాధికారులు అలాంటి అలక్ష్యపు అయ్యవార్ల మీద కఠిన చర్యలు తీసుకోవడమే కాక, రీవాల్యుయేషన్ కోరిన విద్యార్థులకు ఎలాంటి అదనపు రుసుము లేకుండా రీవాల్యుయేషన్ చేయించే విధంగా ఏర్పాట్లు చెయ్యాలి. వీలైతే, ఒకసారి మూల్యాంకనం చేసిన జవాబుపత్రాలను మరో ప్రాంతంలోని అయ్యవార్లు రీచెక్ చేసి, తుది పరిశీలన తర్వాతనే మార్కులు నిర్ధారించే విధంగానైనా చూడాలి. లేకుంటే, రీ వాల్యుయేషన్ కాకముందే, మార్కులు తగ్గాయనే వేదనతో క్షణికావేశంలో విద్యార్థులు ఏమైనా చేసుకుంటే పరిస్థితి ఏమిటని తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ అంశాలను సమగ్రంగా పరిశీలించి, విద్యార్థుల భవిష్యత్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

### సీరియస్‌గా తీసుకున్న ముఖ్యమంత్రి :



అలాంటి నిర్లక్ష్యపు అయ్యవార్ల పట్ల సీఎం చంద్రబాబు నాయుడు బాగా సీరియస్ అయ్యారు. కడపలో మహానాడు కార్యక్రమంలో ఉన్న ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమాచారం రావడంతో, ఆయన వెంటనే చర్యలకు ఉపక్రమించారు. టెన్త్ మూల్యాంకనాల్లో తప్పిదాలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమై, ఆ మేరకు నివేదికలు కూడా తెప్పించుకుంటున్నారు. రీ–వ్యాల్యుయేషన్‌కు, మార్కుల రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న తర్వాత, విద్యార్థుల మార్కుల్లో తేడా ఉండడాన్ని పెద్ద తప్పిదంగా పరిగణిస్తూ, నష్టపోయిన విద్యార్థులకు ఇంటర్ ప్రవేశాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి తప్పిదాలు జరగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తామని ముఖ్యమంత్రి విద్యార్థులకు హామీ ఇచ్చారు.




REMEMBERING OUR FOUNDER

Shri Nalagatla Krishna Reddy Garu

10 Nov 1935 - 2 June 2022

NAGARJUNA
GROUP OF RESTAURANTS
SINCE 1984

*Today, He may not be in our midst physically, But he has left behind an incredible impression on the many lives that he has touched. His story will be told in the years to come to Inspire Many More Generations about our Great Patriarch. And his food legacy will be carried on, with same passion that he passed on.*

HE LOVED HEARTILY, GAVE GENEROUSLY & LIVED FEARLESSLY.
AND AS HE WOULD ALWAYS SAY,
"I AM HERE, DON'T FEAR!"

Fondly Remembered by
**Family & Friends**


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com